https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY



సంపుటి 7 | సంచిక 148 | కర్నూలు | శుక్రవారం, 13 అక్టోబర్ 2023 | పేజీలు 09 | వెల రూ. 5.00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari

# జైల్లో అస్వస్థతకు గురైన చంద్రబాబు

- హుటాహుటిన వైద్యులకు కబురు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

**రాజమండ్రి, అక్టోబర్12 (శ్రీచక్ర) :**

టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో మరోమారు అస్వస్థతకు గురయ్యారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రత భారీగా ఉండటంతో బాబు ఒక్కసారిగా డీ హైడ్రేషన్‌కు గురయ్యారు. ఈ విషయంపై జైల్లో ఉన్న వైద్యాధికారికి చంద్రబాబు ఫిర్యాదు చేశారు. అనంతరం బాబుకు పరీక్షలు చేసి ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారు. ఆయన ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అయితే.. గురువారం కూడా మరోసారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో హుటాహుటిన వైద్యులు జైల్లో పరీక్షలు నిర్వహించారు. చంద్రబాబు చర్మ సంబంధిత అలర్జీ వచ్చిందని వైద్యులు గుర్తించారు. దీంతో.. చర్మవ్యాధి వైద్య నిపుణులను పంపించాలని జైలు అధికారులు రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు లేఖ రాశారు. అత్యవసరంగా పంపించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను జీజీహెచ్ అధికారులు కేటాయించారు. సెంట్రల్ జైలుకు వెళ్లిన వైద్యులు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ సునీత దేవి వైద్య పరీక్షలు నిర్వహించి.. అనంతరం సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చి జీజీహెచ్‌కు వెళ్లారు. వైద్యులు నిశితంగా మరోసారి పరీక్షలు చేశాక.. ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాలి..? ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇవాళ రాత్రికి చంద్రబాబు ఆరోగ్యంపై హెల్త్ బులెటిన్ కూడా రిలీజ్ చేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. బాబు అనారోగ్యంగా ఉన్నారని తెలియడంతో కుటుంబ సభ్యులు, అభిమానులు, టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. ఆయన అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని టీడీపీ నేతలు, కార్యకర్తలు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు సైతం ప్రారంభించారు. జైల్లో చంద్రబాబుకు సరైన వసతులు లేవని కనీసం వేడి నీళ్లు కూడా ఇవ్వట్లేదని.. బ్యారక్‌లో ఎండతీవ్రత ఎక్కువగా ఉందని మొదట్నుంచీ ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. ఆ మధ్య హైకోర్టు, ఏసీబీ కోర్టుకు ఇదే విషయాన్ని బాబు తరఫు లాయర్ సిద్ధార్థ లూథ్రా కూడా వివరించారు. అయినప్పటికీ ఏమీ ప్రయోజనం లేకుండా పోయింది. అయితే అప్పుడే హౌస్ కస్టడీకి ఇచ్చి ఉన్నా.. లేకుంటే బెయిల్ ఇచ్చి ఉన్నా ఈ పరిస్థితి వచ్చేది కాదని టీడీపీ శ్రేణులు ఒకింత ఆవేదన చెందుతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు



బాబు అస్వస్థతకు గురవ్వడంతో మెరుగైన వైద్యం అందించాలని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు. శుక్రవారం నాడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి.. పలువురు టీడీపీ కీలక నేతలు ములాఖత్ కాబోతున్నారని తెలిసింది.

# భారత్-కెనడా విదేశాంగ మంత్రుల రహస్య భేటీ!

**వాషింగ్టన్, అక్టోబర్ 12(శ్రీచక్ర) :**

భారత్- కెనడా మధ్య దౌత్యపరమైన వివాదాలు కొనసాగు తున్న నేపథ్యంలో భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్, కెనడా విదేశాంగమంత్రి మెలానీ అమెరికాలో రహస్యంగా భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్రిటన్ వార్తా పత్రిక ఫినాన్షియల్ టైమ్స్ కథనం ప్రచురించింది. భారత్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను పరిష్కరించేందుకు, న్యూ ఢిల్లీతో దౌత్యపరమైన సంబంధాలను పునరుద్ధరించేందుకు కెనడా ప్రభుత్వం ప్రయత్నిన్నట్లు పేర్కొంది. అయితే ఈ భేటీపై అటు కెనడా కానీ, ఇటు భారత్ కానీ ఏ విధమైన అధికారిక ప్రకటన చేయలేదు. కెనడా దౌత్యవేత్తలు దేశం విడిచి వెళ్లాలంటూ భారత్ గడువు విధించిన నేపథ్యంలో ఇరు దేశాల విదేశాంగ మంత్రులు సమావేశమవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ఖలిస్తానీ సానూభూతిపరుడు హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారత ఏజెన్సీల ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. కెనడా ఆరోపలను భారత్ తీవ్రంగా ఖండించింది. అనంతరం రెండు దేశాల దౌత్యపరమైన సంబంధాల్లో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇరు దేశాలు దౌత్యవేత్తలను బహిష్కరించాయి. కెనడాకు వీసా సేవలను భారత్ నిలిపి వేసింది.

## 40 మంది చిన్నారులను
# నరికేశారు..!

**వాషింగ్టన్,అక్టోబర్12(శ్రీచక్ర) :**

హమాస్ మారణహోమం సృష్టిస్తోంది. వేలాది మంది ఇజ్రాయిల్ ప్రజల్ని చంపేస్తోంది. కిబుజిమ్‌లో హమాస్ ఫైటర్లు బీభత్సం సృష్టించారు. మహిళలు, చిన్నారులు, పసిపిల్లలు, వృద్ధుల్ని అత్యంత కిరాతకంగా చంపేస్తున్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదుల తరహాలో హమాస్ తీవ్రవాదులు రెచ్చిపోతున్నారు. కిబుజిమ్‌లో సుమారు 40 మంది చిన్నారుల్ని హమాస్ నరికి వేసినట్లు ఇజ్రాయిల్ రక్షణ దళాలు పేర్కొన్నాయి. పసి పిల్లలను చంపేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, హమాస్ ఇలాంటి దాడులకు పాల్పడుతుందని తొలుత నమ్మలేదని, కానీ సాక్ష్యలు చెబుతున్న విషయాలు భయానకంగా ఉన్నట్లు ఐడీఎఫ్ ప్రతినిధి జోనాథన్ కన్‌రికస్ తెలిపారు. మహిళలు, చిన్నారుల చేతులకు సంకెళ్లు వేసి నరికివేస్తున్నారని ఆయన అన్నారు. హమాస్ క్రూరత్వానికి ప్రపంచానికి చూపేందుకు.. కిబుజిమ్ ప్రాంతానికి అంతర్జాతీయ జర్నలిస్టులను తీసుకువెళ్లారు.

# స్కిల్ డెవలప్‌మెంట్‌అక్రమ కేసులో

## టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు హైకోర్టులో భారీ ఊరట

**అమరావతి, అక్టోబర్12(శ్రీచక్ర) :**

స్కిల్ డెవలప్‌మెంట్‌అక్రమ కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు హైకోర్టులో భారీ ఊంట లభించింది. ఇవాళ ఉదయం నుంచి హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరగ్గా మధ్యాహ్నానికి లోకేష్‌పై ఉన్న స్కిల్ కేసును హైకోర్టు క్లోజ్ చేసింది. దీంతో లోకేష్‌కు బిగ్ రిలీఫ్ దక్కినట్టయ్యింది. లోకేష్‌ను స్కిల్ కేసులో నిందితుడిగా తాము చేర్చలేదని సీఐడీ చెప్పింది. ముద్దాయిగా చూపని కారణంగా ఆయన్ను అరెస్ట్ చేయబోమని కోర్టుకు సీఐడీ తెలిపింది. ఒకవేళ ఈ కేసులో నిందితుడిగా చేరిస్తే 41-ఏ కింద నోటీసులు ఇస్తామని న్యాయస్థానానికి సీఐడీ అధికారులు వెల్లడించారు. ఈ కేసులో లోకేష్‌ను ఇవాళ్టి వరకూ లోకేష్‌ను మేము నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదని హైకోర్టుకు సీఐడీ వివరించింది. హైకోర్టు తీర్పుతో టీడీపీ శ్రేణులు ఆనందంలో మునిగితేలుతున్నాయి. ప్రభుత్వం కక్షపూరితంగా, అక్రమంగా కేసులు బనాయించవచ్చు కానీ.. న్యాయస్థానాల్లో న్యాయమే జరుగుతుందని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు. ఇది సీఎం వైఎస్ జగన్‌కు దిమ్మతిరిగే షాకేనని టీడీపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. త్వరలోనే అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో కూడా శుభవార్త రావాలని.. టీడీపీ



కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఒక్క లోకేష్ విషయంలోనే కాదు.. టీడీపీ అధినేత చంద్రబాబుకు కూడా త్వరలోనే బిగ్..

(మిగతా2లో..)

# న్యూస్ క్లిక్‌కు బిగుస్తోన్న సీబీఐ ఉచ్చు

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12(శ్రీచక్ర) :**

ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ గత కొన్ని రోజులుగా వార్తల్లో వినిపిస్తున్న పేరు. చైనా నుంచి నిధులు అందుతున్నాయనే ఆరోపణలతో దాని వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థను ఇటీవల ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. సీబీఐ కూడా రంగంలోకి దిగి దర్యాప్తు చేపడుతోంది. అందులో భాగంగా బుధవారం ఉదయం నుంచి న్యూస్ క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ ఇళ్లు, ఆఫీస్‌లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. ఏకకాలంలోఇళ్లు, ఆఫీస్‌లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే, ఆ సంస్థలో పనిచేసే సీనియర్ జర్నలిస్టులు, ఉద్యోగుల ఇళ్లల్లో ఢిల్లీ పోలీసులు సోదాలు చేపట్టారు. ప్రబీర్‌తో పాటు హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తిని అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకున్నారు. నిధులు వ్యవహారం గురించి వారిని ప్రశ్నిస్తున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు న్యూస్ క్లిక్‌కు చైనా నుంచి నిధులు అందినట్లు దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. ప్రబీర్‌పై ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉండటంతో సీబీఐ కూడా రంగంలోకి దిగింది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. దీంతో న్యూస్ క్లిక్‌కు సీబీఐ ఉచ్చు బిగుస్తోంది. అయితే, 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ తదితరులపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్, వాస్తవానికి, తీవ్రవాదం మినహా మరే ఇతర నేరాలను వెల్లడించని అస్పష్టమైన ఆరోపణల సమ్మేళనంగా వుంది. 'న్యూస్ క్లిక్'లో ప్రచురితమైన ఏ వార్తా కథనం లేదా సమాచారాన్ని ఉటంకించకుండానే, దేశ భద్రతను దెబ్బ తీయడానికి కుట్ర పన్నడం దగ్గర నుండి 2019 పార్లమెంట్ ఎన్నికలకు అంతరాయం కలిగించడం వరకు, ప్రభుత్వంపై అసంతృప్తికి కారణమవడం నుండి కీలక సేవలకు అంతరాయం కలిగించడం వరకు అనేక నేరాలకు పాల్పడ్డారంటూ ఎఫ్ఐఆర్ పేర్కొంది. కుట్రకు పాల్పడ్డారని, వివిధ గ్రూపుల మధ్య శతృత్వాన్ని పెంపొందించడానికి ప్రయత్నించారంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ-ఉపా), ఐపిసి నిబంధనలను వర్తింపచేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపంగా లేదా తీవ్రవాద చర్యగా పేర్కొనగలిగే ఎలాంటి విధ్వంసకర చర్యను ఆ ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించకపోవడం అన్నింటి కంటే గుర్తుంచుకోదగ్గ అంశంగా వుంది. ప్రభుత్వంపై అసంతృప్తిని రగిల్చి, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను దెబ్బ తీసే, దేశ ఐక్యత, భద్రతకు ముప్పు కలిగించే లక్ష్యంతో, శత్రువులు భారత్ లోకి అక్రమంగా విదేశీ నిధులను చొప్పించారనే సాధారణ వర్ణన మాత్రమే ఆ ఎఫ్ఐఆర్‌లో వుంది. అరుణాచల్ ప్రదేశ్, కాశ్మీర్‌లు భారత్‌లో భాగం కాదని చూపించే ఇ-మెయిల్స్ మార్పిడి ప్రాతిపదికగా కుట్ర జరిగిందంటూ ఎఫ్ఐఆర్ ప్రస్తావించింది. ఇతర నిత్యావసర సరఫరాలకు ఆటంకం కలిగిందని ఎఫ్ఐఆర్ పేర్కొంది.

# దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో

- దక్షిణ మధ్య రైల్వే జోన్ బాదుడు షురూ
- ప్రయాణికులకు రైల్వే చార్జీలు తలకు మించిన భారం

**విజయవాడ/హైదరాబాద్,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ బాదుడు షురూ చేసింది. పేద, మధ్య తరగతుల ప్రయోజనాలు పక్కన పెట్టి ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నది. పండుగల సందర్భంగా నగర వాసులు తమ సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇదే అదునుగా భావించిన దక్షిణ మధ్య రైల్వే రెగ్యులర్ విధానంలో కాకుండా ప్రత్యేక రైళ్లను అధిక సంఖ్యలో నడుపుతూ చార్జీలను అమాంతం పెంచేసింది. ప్రస్తుతం రెగ్యులర్ టికెట్ చార్జీలపై అదనంగా 30 నుంచి 50 శాతం వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులకు రైల్వే చార్జీలు తలకు మించిన భారంగా మారుతున్నది. పైగా రిజర్వేషన్‌కు దాదాపు రెండు నెలలు ముందుగానే టికెట్ బుక్ చేసుకున్నా.. సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. అంతా వెయిటింగ్ లిస్టు, ఆర్‌ఏసీతోనే సరిపోతుంది. ఒక వేళ టికెట్ బుక్ చేసుకుని, టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే అందులో కూడా 25 నుంచి 50 వరకు చార్జీలు వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎస్‌సీఆర్ జోన్ ఆధ్వర్యంలో రెగ్యులర్ రైలు సర్వీసుల సంఖ్య తగ్గిస్తూ.. ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్ వంటి డివిజన్ల పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 620 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

# ఆర్థిక ఉగ్రవాదిలా జగన్ పాలన

**గుంటూరు, అక్టోబర్12(శ్రీచక్ర) :**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కాళ్లు మొక్కుతూ ఆర్థిక ఉగ్రవాదిలా జగన్ పాలన చేస్తున్నాడని సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ కార్యాలయంలో గురువారం నాడు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి సీపీఐ నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మీడియాతో మాట్లాడుతూ..“వైసీపీ ప్రభుత్వం ఏపిని అప్పుల కుప్పగా మార్చింది. ఇప్పటికి 67 వేల కోట్లు అప్పు తెచ్చారు. కేంద్రం జగన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకోని కాపాడుతోంది. టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేష్‌లపై తప్పుడు కేసులు పెట్టి జగన్‌రెడ్డి పొలిటికల్ టెర్రరిజం నడుపుతున్నాడు. వలంటీర్ వ్యవస్థను రాజకీయ కార్యక్రమాలకు వాడుకుంటున్నారు. కృష్ణ జలాల విషయంలో నోరు మెదపలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉంది. బీజేపీ నేతలు పురంధరేశ్వరి, జీవిఎల్ కూడా కృష్ణ జలాలపై నోరు ఎత్తడం లేదు. మోదీ, జగన్, కేసీఆర్ కలసి కుట్ర రాజకీయాలు చేస్తున్నారు” అని ముప్పాళ్ల నాగేశ్వరరావు మండిపడ్డారు.



# ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు వార్నింగ్

**న్యూఢిల్లీ,అక్టోబర్12(శ్రీచక్ర) :**

ఇజ్రాయెల్ - హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతున్నది. అయితే, హమాస్‌కు ఇరాన్ సహకారం అందిస్తుందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సహాయం, అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలను మోహరిస్తున్నది. ఇజ్రాయెల్ ? హమాస్ మధ్య యుద్ధం కొనసాగుతున్నది. అయితే, హమాస్‌కు ఇరాన్ సహకారం అందిస్తుందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇరాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సహాయం, అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలను మోహరిస్తున్నది. ఈ క్రమంలో ఇరాన్‌ను జాగ్రత్తగా ఉండాలని బైడెన్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూతో బుధవారం మాట్లాడినట్లు తెలిపారు. యుద్ధ నిబంధనల ప్రకారం ఏవైనా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. నెతన్యాహు 40 ఏళ్లుగా తనకు తెలుసునన్నారు. ఇజ్రాయెల్ కోపం, నిరాశ సమయంలోనూ యుద్ధ నిబంధనల ప్రకారం అడుగులు వేస్తుందన్నారు. హోలోకాస్ట్ తర్వాత యూదులకు ఇది అత్యంత ఘోరమైన ఘటన అని, ఇజ్రాయెల్ శక్తి మేరకు ప్రతిదీ చేస్తుందన్నారు. హమాస్ దాడులను అత్యంత క్రూరమైన చర్యగా అభివర్ణించారు. మరో వైపు అమెరికా పౌరులకు యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. గాజా వైపు వెళ్లొద్దని, ఈ విషయంలో జాగ్రత్త వహించాలని సూచించింది.



## సంపాదకీయం

# అన్ని పార్టీలదీ అధికార దాహమే !

ఎన్నికల్లో లబ్ధిపొందడం, అధికారంలో కొనసాగడం, తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం..అదే పాలనగా అద్భుతమైన పాలనా తీరుగా అభివర్ణిస్తూ పాలక పార్టీలు ప్రజలను వంచిస్తున్నాయి. ఎన్నికల్లో ప్రజలను బురిడీ కొట్టించడం కోసం బిజెపి, కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలు పోటీపడుతున్నాయి. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నాయి. కొండమీది కోతిని తెచ్చి ఇస్తామని అంటున్నాయి. అలవికాని ఆశలు చూపుతున్నాయి. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నాయి. భారత్‌లో రాజకీయాలను రానురాను..తమ స్వంత వ్యవహారాల్లాగా మార్చుకోవడం జాతీయస్థాయిలో అయినా, ప్రాంతీయ స్థాయిలో అయినా ఆయా పార్టీలు అలవర్చుకున్నాయి. అధికారంలోకి వస్తేచాలు..ఏదైనా చేయవచ్చన్న ధీమాలో పార్టీలు ఉన్నాయి. అక్రమ సంపాదనలు, అధికార దర్పం సాధారణ విషయంగా మారుతోంది. కేంద్రంలోని బిజెపి, కాంగ్రెస్‌తో పాటు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు ఇందుకు అతీతులేం కాదన్న రీతిలో పరిస్థితులు ఉన్నాయి. అధికారం లో ఉంటే అదేదో తమ సొంత వ్యవహారాల్లో చేసేస్తున్నారు. చట్టాలు, రాజ్యాంగం అన్నీ మరచిపోతున్నారు. తాము చేస్తున్నదే సరైన విధానం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. అన్నిచోట్లా ఆధిపత్య రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ నిరంకుశత్వ విధానాల కారణంగా ప్రజలకు చేటుగా తయారయ్యింది. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న ఎపికి చెందిన పార్టీలు బిజెపిని మాత్రం ప్రశ్నించడం లేదు. వైసిపి, టిడిపిలు పరస్పర కలహం వల్ల నష్టపోతున్నది ప్రజలే అని గుర్తించడం లేదు. పరస్పర విరుద్ధమైన వైసిపి, టిడిపి, జనసేన మూడింటినీ లోబర్చుకోవడం కోసం మరోవైపు కేంద్రంలోని బిజెపి చేయని ప్రయత్నాలు లేవు. తెలంగాణ లోనూ బిఆర్ఎస్ పైనా బిజెపి ఒత్తిడి పెంచడం చూస్తున్నాం. అలాగే అధికారంలో ఉన్న వైసిపి, బిఆర్ఎస్‌లు కూడా అధికార దుర్వినియోగంలో ముందున్నాయి. తమకు ఎదురులేదన్న రీతిలో పాలకులు ఉన్నారు. ప్రాంతీయ పార్టీలు పరస్పర కలహాలతో జుట్టును కేంద్రం చేతుల్లో పెడుతున్నారు. దీంతో పరిస్థితి దారుణంగా తయారైంది. లౌకిక ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య తత్వాన్ని కాలరాచే రాజకీయ దాడులకూ, కుయుక్తులకూ పాలకుల తీరు అద్దం పడుతున్నది. ప్రాంతీయ పార్టీలు తమ మనుగడ కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తలవంచుతున్న తీరు అత్యంత దుర్మార్గం కాక మరోటి కాదు. దీనికితోడు ఆయా పార్టీలు కూడా కేంద్రంలో ఉన్న పార్టీలకు తలొగ్గి తమ పబ్బం గడుపుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి ఎలాగోలా ప్రత్యక్ష పరోక్ష మద్దతుదారులను పెంచుకోవడం ద్వారా అధికారన్ని మరింత పదిలం చేసుకోవాలన్న ఎత్తుగడలో బిజెపి ఉంది. ఒక దశలో మోడీ విధానాలపై విరుచుకుపడిన కెసిఆర్ ఇటీవల మౌనం దాల్చడంతో బిజెపి, బిఆర్ఎస్‌లు మళ్లీ దగ్గరయ్యాయనే సందేహాలు వస్తున్నాయి. పారదర్శకత లేని పాలక పార్టీల వ్యూహాలు, అవకాశవాదాలు ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదు. ఓట్ల వేటకోసం ఎపి సిఎం జగన్ మాత్రం కేవలం డబ్బుల పందేరాన్ని నమ్ముకున్నారు. టిఆర్ఎస్ కాస్తా బిఆర్ఎస్‌గా మారిన తర్వాత దేశవ్యాపితంగా ప్రత్యామ్నాయం తీసుకొస్తామని అన్న కెసిఆర్ ప్రగతిభవన్‌కు పరిమితం అయ్యారు. . అయితే తాము ప్రస్తుతానికి మహారాష్ట్రలో మాత్రమే పోటీ చేస్తామని ఇటీవల కెటిఆర్ స్పష్టీకరించారు. బిఆర్ఎస్ నేస్తంగా వున్న మజ్లిస్ నేత ఒవైసీ కూడా మూడో ఫ్రంట్ కెసిఆర్ నాయకత్వాన ఏర్పడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సర్వేలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వుండగా బిజెపి నేతలు మాత్రం తమకు అనుకూలంగా వుంటాయనీ హంగ్ సభలో బిజెపినే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రకటించారు. టిడిపి అనుకూల ఓటర్లు ఆంధ్ర ప్రాంత ఓటర్ల కోసం ఇదంతా చేస్తున్నారనే భావన బలపడింది. బిజెపి కూడా రకరకాలుగా స్పందించింది. తెలంగాణలో బిఆర్ఎస్ వ్యతిరేక ఓట్లలో చీలిక తేవడానికే బిజెపి కుట్రలు చేస్తున్నదని అనేకులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌లో అనేక సమస్యలు, అనైక్యతలు వున్నా బిఆర్ఎస్‌కు అదే ప్రధాన ప్రత్యర్థి అని కెసిఆర్ కూడా అంగీకరించి వున్నారు. అందువల్లనే బహుశా దానికి అవకాశం లేకుండా చేయడం కోసం మోడీ రంగంలోకి దిగారనుకోవాల్సి వుంటుంది. దక్షిణాదిన అసలే టికానా లేని బిజెపి కాంగ్రెస్‌కు ఏ విధంగానూ అవకాశం ఇవ్వకూడదనే గట్టి వైఖరితో వుంది.మరోవైపు చంద్రబాబు అరెస్టు కేంద్ర బిజెపి అండదండలు కనీసం ఆమోదం లేకుండా జరిగి వుండదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలుగుదేశంలోనూ చాలా మందిలో ఇదే భావం వుంది. అయినా సరే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్, బాలకృష్ణ, అచ్చెంనాయుడు వంటి వారు బిజెపికి సంబంధం లేదని పదేపదే చెబుతున్నారు. ఆ బిజెపి నేతలతో కలసి మాట్లాడితే ఏదో ఉపశమనం దొరుకుతుందని ఢిల్లీలో మకాం వేసి మంతనాలు జరుపు తున్నారు. గతంలో చంద్రబాబు, ఇప్పుడు పవన్ కళ్యాణ్ మోడీ సర్కారును పోటీపడి పొగుడుతూనే వున్నారు. కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను ఓడించడం కోసం టిడిపి, జనసేనలతో కలసి వెళ్తామని సిపిఐ ప్రకటించింది. బిజెపితో ప్రత్యక్ష పరోక్ష అవగాహన అనుబంధం వున్న వారెవరితోనూ కలిసే అవకాశమే లేదని సిపిఎం నాయకులు వెల్లడించారు. ఏక కాలంలో పరస్పర విరుద్ధమైన వైసిపి, టిడిపి, జనసేన మూడింటినీ లోబర్చుకోవడమే గాక బిఆర్ఎస్ పైనా ఒత్తిడి పెంచడం చూస్తున్నాం. తమలో తాము కలహించుకుంటూ రాష్ట్రానికి అన్యాయం చేసే ఈ పార్టీలు బిజెపిని మాత్రం ప్రశ్నించడం లేదు. పైపెచ్చు పరస్పర కలహాలతో జుట్టు దాని చేతుల్లోనే పెడుతున్నారు. మొత్తంగా అన్నిచోట్లా ఆధిపత్య రాజకీయాలు నడుపుతున్నారు. ఇందులో ఎవరి వ్యూహాలు వారివే. పాలక పార్టీలు తమ మనుగడ కోసం చేస్తున్న యత్నాలు, వేస్తున్న ఎత్తుగడలు ప్రజలు గమనిస్తున్నారు. హానికర విధానాలపై పోరాడవలసిన తరుణమిది. ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రజలు జాగరూకతతో అధికారం వెలగబెట్టిన పార్టీల తీరును గమనించి నడుచుకోవాల్సి ఉంది. వారి అధికార అహంకారాన్ని అణిచివేసే ఆయుధం ఓటని గుర్తించాలి.

# హమాస్ దాడిలో ఇరాన్ పాత్రపై మరోమారు స్పందించిన అమెరికా

**వాషింగ్టన్, అక్టోబర్ 12(శ్రీచక్ర) :**

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడుల వెనుక ఇరాన్ పాత్రపై నిర్దిష్ట సమాచారమేమీ లేదని అమెరికా తెలిపింది. మిలిటెంట్ల గ్రూపులోని పోరాట విభాగానికి నిధులు అందిస్తున్నట్లు మాత్రం స్థూలంగా కనిపిస్తోందని పేర్కొంది. 'హమాస్‌కు పోరాటంలో సింహభాగం నిధుల్ని ఇరాన్ సమకూరుస్తోంది. మొదటి నుంచీ మేం ఇదే చెబుతున్నాం. వారికి కావాల్సిన శిక్షణ ను ఆ దేశమే ఇచ్చింది. ఇతరత్రా శక్తిసామర్థ్యాలను అదే సమకూర్చింది. చాలాఏళ్లుగా హమాస్‌తో వారు సంప్రదింపుల్లో ఉన్నారు. ప్రస్తుత పరిణామాలకు ఇవన్నీ కలిసి కారణమయ్యాయి. దాడి గురించి ఇరాన్‌కు ముందే తెలుసా, ఆ దేశమే దానికి ప్రేరేపించిందా అనేది మాకు తెలియదు. వీటిపై ఇజ్రాయెల్‌తో రోజువారీ ప్రాతిపదికన మాట్లాడుతున్నాం' అని అమెరికా జాతీయ భద్రత సలహాదారుడు జేక్ సులివాన్ విలేకరులకు చెప్పారు. అటు ఉక్రెయిన్‌కు, ఇటు మిత్రదేశమైన ఇజ్రాయెల్‌కు అన్నివిధాలా తమ సహకారం కొనసాగుతుందని చెప్పారు. ఇక, హమాస్ దాడుల్లో 22 మంది అమెరికన్లు మరణించారని అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. మరికొంతమంది గాజాలో బందీలుగా ఉన్నారని చెప్పారు. పశ్చిమాసియా ఘర్షణ నేపథ్యంలో ఆయన మాట్లాడారు. హమాస్ కు మద్దతుగా దాడులకు దిగవద్దని ఇరాన్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్లను హెచ్చరిం చారు. అమెరికా నుంచి తొలి విడత ఆయుధ సామగ్రి ఇజ్రాయెల్ చేరుకుంది. బుధవారం కార్గో విమానంలో ఇవి వచ్చాయని పేర్కొంటూ ఇజ్రాయెల్ సైన్యం ఒక వీడియోను విడుదల చేసింది. బైడెన్ వ్యాఖ్యలపై హమాస్ స్పందించింది. అవి పక్షపాతంతో కూడుకున్న వ్యాఖ్యలని విమర్శిం చింది. ఇజ్రాయెల్ ఆక్రమణలను అడ్డుకోవడానికి పోరాడటం పాలస్తీనా వాసుల హక్కని స్పష్టంచేసింది.

# స్కిల్ డెవలప్‌మెంట్‌అక్రమ కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు హైకోర్టులో భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి..)

రిలీఫ్ రావొచ్చని ఆ పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమ కేసులో మొదట్నుంచీ లోకేష్ పేరు ఉందా.. లేదా..? అనేది సీఐడీకే స్పష్టత లేదు. లోకేష్ పేరు లేదని చెబుతున్నప్పటికీ.. చంద్రబాబు అరెస్ట్ తర్వాత సీఐడీ చీఫ్ సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించిన నిధులు లోకేష్‌కు వచ్చాయని ఆరోపణలు చేశారు. అయితే లోకేష్‌కి ఈ శాఖతో ఎలాంటి సంబంధం లేదన్న విషయం జగమెరిగిన సత్యమే. లోకేష్ పంచాయతీరాజ్, ఐటీ శాఖలు నిర్వహించారు. అయితే కిలారు రాజేష్ ద్వారా వచ్చాయన్నది సీఐడీ ఆరోపణ. అంతకుముందు కిలారు రాజేష్ ఇంటి దగ్గర ఐటీ అధికారులు తనిఖీలు చేసి ఎటువంటి ఆధారాలు దొరకపోవడంతో ఆ కేసును మూసేశారు. కానీ.. కిలారు షెల్ కంపెనీల ద్వారా లోకేష్‌కు డబ్బులు వచ్చాయని సీఐడీ పదే పదే చెబుతోంది. దర్యాప్తు చేస్తున్నామని, ఆధారాలు లభిస్తే అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని సీఐడీ అధికారులు పేర్కొన్నారు. అంతేకాదు వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇదే పాటపాడడంతో ముందస్తు బెయిల్ కావాలంటూ లోకేష్ తరపు న్యాయవాదులు ముందస్తు బెయిల్ పిటిషన్ కోసం లంచ్ మోషన్ దాఖలు చేశారు. సీన్ కట్ చేస్తే.. అసలు స్కిల్ కేసులో లోకేష్ నిందితుడే కాదని.. ఆయనకు ఎలాంటి సంబంధంలేదని న్యాయస్థానం ముందే సీఐడీ క్లియర్ కట్ చెప్పింది.

## కెనడా హిందూ దేవాలయాలలో దొంగతనాలు

**ఒట్టావా, అక్టోబర్ 12(శ్రీచక్ర) :**

కెనడాలోని హిందూ దేవాలయాలే లక్ష్యంగా దొంగలు రెచ్చిపో తున్నారు. ఆదివారం ఒక్కరోజే మూడు వరుస దొంగతనాలు జరగటం అక్కడి హిందువుల్ని ఆందో ళనకు గురిచేసింది. ఘటనలపై కెనడా పోలీసులు అనుమానితుడి కోసం వెదుకులాట ప్రారంభిం చారు. నిందితుడి ఆనవాళ్లు చెబుతూ స్థానిక ప్రజల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. గ్రేటర్ టొరొంటో ఏరియా లోని ఓ హిందూ దేవాలయంలో దొంగ చొరబడి, అక్కడున్న డొనేషన్ బాక్సుల్లో నుంచి పెద్దమొత్తంలో నగదు చోరీ చేశాడు. అజాక్స్ పట్టణంలోనూ చోరీ జరిగింది.

# కాంగ్రెస్‌ను నమ్ముకుంటే ప్రజలకు శఠగోపం

ఎవరొచ్చినా 24 గంటల కరెంట్ కట్

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

**నిజామాబాద్,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

కాంగ్రెస్‌ను నమ్ముకుంటే ప్రజలకు శఠగోపం తప్పదని, అధికారం కోపం వారు తన్నులాడుకోవడం కూడా తప్పదని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ నేతలు ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కరెంట్ మాటలే ప్రజలు గుర్తించి నడచుకోవాలన్నారు. ప్రజలు జాగ్రత్తగా లేకపోతే తెలంగాణ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి పార్టీ టికెట్లను అమ్ముకుంటున్నట్లు వస్తున్న ఆరోపణలు చూస్తుంటే ఆ పార్టీ ఎంతకు దిగజారిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. సొంత పార్టీ అభ్యర్థులనే దోచుకుంటున్నకాంగ్రెస్ నాయకులు, పొరపాటున అధికారంలోకి వస్తే ప్రజలను కూడా దోచుకుంటారని హెచ్చరించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, మూడు గంటలు చాలన్న రేవంత్ రెడ్డి ఎలాంటి లీడరో ప్రజలు గుర్తించాలని అన్నారు. విద్యుత్ రంగాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దని అన్నారు. దశాబ్దాలు కొట్లాడిన బాగుపడని తాండాలు ఇప్పుడు కేసీఆర్ నాయకత్వంలో బాగుపడుతున్నాయి. గిరిజనులకు కేసీఆర్ ఆత్మగౌరవాన్ని ఇస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ప్రతి జిల్లాకు మంచి నీళ్లు అందాయి. అన్నిరంగాల్లో తెలంగాణ అభివృద్ధి చెందుతోందని అన్నారు. ప్రచారంలో ఇవన్నీ తాము ప్రజలకు వివరిస్తున్నామని అన్నారు. జనంలో బీఆర్ఎస్ పార్టీపై స్పందన బాగా కనిపిస్తుంది. ఒక్క చోట కూడా ప్రభుత్వంపై వ్యతిరేకత కనిపించటం లేదన్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం అయితేనే అన్నిరంగాలు బాగుపడతాయని జనం నమ్ముతున్నారు. ఎన్నికలు వస్తున్నాయనే కాంగ్రెస్ నాయకులు కల్ల బొల్లి మాటలతో మభ్యపెట్టడానికి బస్సుయాత్రతో వస్తారు. వారిని నమ్మితే బతుకులు ఆగం అవుతాయని అన్నారు. ఇన్నేళ్లలో ఏం చేయని కాంగ్రెస్, బీజేపీ పార్టీల నేతలు మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారు. దేశంలో తెలంగాణను కేసీఆర్ నంబర్ వన్ స్థానంలో నిలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఛాన్స్ కాదు, లక్ష ఛాన్సులు ఇచ్చినా దేశం బాగుపడ దన్నారు.. వచ్చే ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి నియోజకవర్గంలో విజయ బావుటాను ఎగురవేద్దామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరైనా తన ఇంటికి వచ్చి మాట్లాడవచ్చన్నారు. పార్టీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దన్నారు.

# ఎపిలో కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

27న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

**విజయవాడ,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా రూపొందించే కార్యక్రమంలో ఎన్నికల సంఘం నిమగ్నమైంది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ఫ్రీజింగ్‌లో పెట్టారు. ముసాయిదా జాబితా ప్రచురణ ఈనెల 27న జరుగుతుంది. ఆ రోజు నుంచి వెబ్‌సైట్ ఫ్రీజింగ్ తొలగించనున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా నూతన ఓటరు నమోదు, తొలగింపు, సవరణలకు ఇచ్చిన దరఖాస్తు గడువు గతనెల 19వ తేదీతో ముగిసింది. 20వ తేదీ నుంచి ఎలక్షన్ వెబ్‌సైట్‌ను ఫ్రీజింగ్‌లో పెట్టారు. దీంతో ఆన్‌లైన్‌లో ఓట్ల మార్పులు- చేర్పులతో పాటు తొలగింపు పక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓటర్ల తొలగింపులకోసం వచ్చిన దరఖాస్తులకు నోటీసులు ఇచ్చి, సంజాయిషీ తీసుకుని ఆయా మండలాల పరిధిలోని అధికారుల వద్ద ఉంచుతారు. ఈనెల 27న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరగనుంది. 28వ తేదీ నుంచి ఫ్రీజింగ్ తొలగించి, ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటితో పాటు ఓటు నమోదు, తొలగింపులు, సవరణలకు అవకాశం ఇస్తారు. 2024 జనవరి 5న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నారు. ఈ నేపథ్యంలో తుది జాబితా తయారీకి అనుగుణంగా ఎన్నికల చర్యలు చేపట్టారు.

# విచారణాధికారిని మార్చడం తగదు

**గుంటూరు,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో విచారణాధికారిగా ఉన్న అదనపు ఎస్పీ జయరామరాజును మార్చడం వెనుక కుట్ర ఉందని టిడిపి సీనియర్ నేత జివి ఆంజనేయులు ఆరోపించారు. కొత్త ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా జయరామరాజు స్థానంలో డీఎస్పీ విజయభాస్కర్‌ను ఎందుకు నియమించారని ప్రశ్నించారు. ఏఎస్పీ స్థాయి అధికారి జయరాజు ప్రభుత్వం మాట వినడం లేదా? విజరుభాస్కర్‌తో కేసును తాము అనుకున్నట్టుగా నడిపిద్దామనుకుంటున్నారా అని ప్రశ్నించారు. కేసు కీలకమైన దశలో ఉన్నప్పుడు బెయిల్ ఇవ్వొద్దని చెప్పే ప్రభుత్వం.. ఇప్పుడు ఈ దశలో విచారణాధికారిని ఎలా మారుస్తారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారుల కుటుంబాలు కూడా కేసులు జరుగుతున్న తీరుపై ఆలోచన చేయాలన్నారు. ఇప్పుడు తప్పుడు విధానాల్లో వెళ్తే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఎద్దేవా చేశారు.

# దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ

- అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచింది: బిగాల

**నిజామాబాద్,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ రాష్ట్రం మారిందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణెళిశ్ అన్నారు. ఏ దేశం వెళ్లినా అక్కడి ఎన్నారైలు కూడా దీనిని అంగీకరిస్తారని అన్నారు. ప్రజలు మరోమారు కెసిఆర్‌ను ఆశీర్వదించి, అభివృద్ధికి బాటలు వేయాలని అన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై వివిధ పార్టీలకు చెందిన చాలామంది కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓటెయ్యండని ఎమ్మెల్యే బిగాల కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేకే కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధపు పథకాలను ప్రచారం చేస్తూ, ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ మోసాలతో కూడుకున్నదని మండిపడ్డారు. అభివృద్ధి అంటేనే బీఆర్ఎస్ పార్టీ అని, ప్రజలకు నిరంతరం అండగా ఉంటున్నదన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసిందని, ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

# నేటినుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

**కొత్తగూడెం,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

ఆర్టీసీ పండుగ సీజన్లలో ఎక్కువ సర్వీసులు ఏర్పాటు చేసి అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నది. దసరాకూ ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం రీజియన్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు నడుపనున్నది. హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎక్కువ మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎంతోమంది వ్యాపారాలు, ఉద్యోగాల రీత్యా వెళ్లి అక్కడ కుటుంబాలతో స్థిరపడ్డారు. పండుగ సమయంలో వారంతా స్వస్థలాలకు వస్తారు కాబట్టి వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నది. ఈ నెల 13 నుంచి 23 వరకు ఈ సర్వీసులు ప్రయాణికులకు సేవలు అందిస్తాయి. ఖమ్మం డిపో నుంచి 230 సర్వీసులు, మధిర డిపో నుంచి 75, సత్తుపల్లి డిపో నుంచి 86, భద్రాచలం డిపో నుంచి 141, కొత్తగూడెం డిపో నుంచి 80, మణుగూరు డిపో నుంచి 83 ప్రత్యేక సర్వీసులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చనున్నాయి. ప్రయాణికుల నుంచి ఆర్టీసీ ఒక్క పైసా అయినా ఎక్కువ తీసుకోదు. సాధారణ చార్జీలు చెల్లించి ప్రయాణికులు ప్రయాణించొచ్చు. ప్రయాణికులను ప్రోత్సహించేం దుకు ఆర్టీసీ యాజమాన్యం వినూత్న నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 21 నుంచి 23 వరకు, 28 నుంచి 30వ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీకుల కోసం లక్కీడ్రా నిర్వహించనున్నది. ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల సౌకర్యార్థం సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నది. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కొత్తగూడెం డీఎం బాణాల వెంకటేశ్వరరావు అన్నారు.

# బెన్ను గ్రహశకలంలో నీటి ఆనవాళ్లు-నాసా

**న్యూయార్క్, అక్టోబర్ 12(శ్రీచక్ర) :**

అంతరిక్షం నుంచి భూమిపైకి తీసుకొచ్చిన బెన్ను గ్రహశక లం నమూనాల్లో నీరు, కార్బన్ ఆనవాళ్లు ఉన్నట్టు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ -నాసా వెల్ల డించింది. ఈ గ్రహశకలంలో నీరు, కార్బన్ సమృద్ధిగా ఉన్నట్టు.. అవే భూమి ఏర్పడటా నికి కీలకమ ని నాసా పేర్కొంది. కాగా, ఇటీవల బెన్ను అనే గ్రహశకలం నుంచి రాళ్లు, దుమ్మును అంతరిక్షం నుంచి నాసా తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 2016లో నాసా ఓసిరిస్ రెక్స్ మిషన్‌ను ప్రయోగిం చగా.. ఆ మిషన్ 2020లో బెన్ను గ్రహశకలం నుంచి నమూనాలను సేకరించింది.

# వైద్యం, ప్రజారోగ్యంపై 15న సదస్సు

**గుంటూరు,అక్టోబర్12 (శ్రీచక్ర) :**

వైద్యాంప్రజారోగ్యం అనే అంశంపై ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి తెలిపారు. ప్రజారోగ్యం ప్రజలందరి హక్కుగా ఉండాలని, వైద్య ఆరోగ్య రంగానికి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో నిధులు పెంచాలని తదితర డిమాండ్లతో దీనిని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మేరకు గుంటూరులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సును ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభిస్తారన్నారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య విధానాలు-ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ యం.గేయానంద్, 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యాంప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై నెల్లూరు పీపుల్స్ పాలీక్లినిక్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాజేశ్వరరావు, ఆరోగ్య హక్కు చట్టాం2023పై ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.సాయిప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు. నెఫ్రాలజీ వైద్యులు గొంది శివరామయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎం.వి.రమణయ్య, టి.కామేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గంటారన్నారు. వైద్యం, ప్రజారోగ్యాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకోవాలని జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

# ఈ నెల 14, 15వ తేదిలో సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్సై) మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షలు

## కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్

**కర్నూలు, అక్టోబర్ 12(శ్రీచక్ర)**

రెండు రోజుల పాటు ఈ నెల 14, 15వ తేదిలలో కర్నూలు పట్టణ కేంద్రంలోని 14 పరీక్ష కేంద్రాలలో ఎస్ ఐ మెయిన్స్ ఫైనల్ రాత పరీక్షలు జరగనున్నాయని కర్నూలు రేంజ్ డిఐజి ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ తెలిపారు. ఈ సంధర్బంగా గురువారం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో ఒక సమావేశం నిర్వహించారు. 2 రోజుల పాటు జరిగే పరీక్షలలో నాలుగు పేపర్లు (2 పేపర్లు డిస్క్రిప్టివ్ టైప్ మరియు 2 పేపర్లు ఆబ్జెక్టివ్ టైప్) ఉంటాయి. అక్టోబర్ 14 వ తేది ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు (పేపర్-%×) ఒ% మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు (పేపర్ %××%) ఉంటుంది. అక్టోబర్ 15 వ తేది ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు (పేపర్-%×××) ఒ% మధ్యాహ్నం 2.30 %ూవీ% నుండి సాయంత్రం 5.30 వరకు (పేపర్-%×ఒ%) పరీక్ష జరగనుంది. ఎస్సై మెయిన్స్ పరీక్ష రాసే అభ్యర్డుల పరీక్ష కేంద్రాలు 14.సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల - సుంకేసుల రోడ్, - కర్నూలు, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల - సుంకేసుల రోడ్, - కర్నూలు. సిస్టర్ స్టానిస్లాస్ మెమోరియల్ ఇంగ్లీష్ స్కూల్ - సుంకేసుల రోడ్ - కర్నూలు. మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్ (ఏ%--% క్యాంప్) , కర్నూలు, కె.వి.ఆర్. ప్రభుత్వ కాలేజ్ ఫర్ ఉమెన్ - రైల్వే స్టేషన్ రోడ్, కర్నూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్), కోట్ల సర్కిల్ - కర్నూలు బృందావన్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ పెద్ద టేకూరు కర్నూలు, అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల దూపాడు కర్నూలు. డా. కెవి సుబ్బారెడ్డి ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, దూపాడు కర్నూలు. రాయలసీమ యూనివర్సిటి కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ % నంద్యాల రోడ్ - కర్నూలు. జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ - నంద్యాల రోడ్ కర్నూలు. జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ - నంద్యాల రోడ్ %--% కర్నూలు. జి. పుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ %ఒ% టెక్నాలజీ నందికొట్కూర్ రోడ్ కర్నూలు. రవీంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ నందికోట్కూరు రోడ కర్నూలు. ఈ పై 14 పరీక్ష కేంద్రాలలో 8,521 మంది అభ్యర్ధులు ఎస్సై మెయిన్స్ పరీక్ష కు హాజరువుతున్నారని తెలిపారు. దళారుల మోసపూరిత మాటలు , ఉద్యోగాలు ఇప్పిస్తామని గాని చెప్పే వారి మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి నష్టపోవద్దని ఎస్సై మెయిన్స్ ఫైనల్ రాత పరీక్ష రాసే అభ్యర్థులకు కర్నూలు రేంజ్ డిఐజి గారు, జిల్లా ఎస్పీ గారు తెలిపారు. పోలీసు నియామక ప్రక్రియ రాత పరీక్షలు డిఎస్పీ స్ధాయి అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా , నిష్పక్షపాతంగా జరుగుతాయన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వదంతులు, పుకార్లు నమ్మవద్దన్నారు. పరీక్ష హాజరయ్యే అభ్యర్దులు హాల్ టికెట్ , ఆధార్ వంటి గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచ్ లు తీసుకురాకుడదన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్దులు ముందురోజే ఎగ్జామ్ సెంటర్ల ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే



అభ్యర్దులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలన్నారు. ఏవరైనా పరీక్ష కేంద్రాలలో మాల్ ప్రాక్టిస్ వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్దులు తమ సెంటర్ల ను తెలుసుకునే విధంగా అర్ టీ సి బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి, అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అభ్యర్దులకు తెలిపారు. దళారుల గురించి తెలిస్తే డయల్ 100 కు గాని, దగ్గర్లోని పోలీసుస్టేషన్ లో గాని సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈ సంధర్బంగా కర్నూలు రేంజ్ డిఐజి, జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, కర్నూలు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల అడిషనల్ రీజినల్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్, ప్రొఫెసర్ జోహూర్ , బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రా అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

**పెద్దకడబూరు, అక్టోబర్ 12 (శ్రీచక్ర) :**

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, లీగల్ సెల్ తాలూకా అధ్యక్షులు బాబురావు అన్నారు. గురువారం పెద్దకడబూరు మండల పరిధిలోని గంగులపాడు గ్రామంలో క్లస్టర్ ఇంచార్జీ లీగల్ సెల్ అధ్యక్షులు బాబురావు ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఇంటింటికి తిరుగుతూ అక్రమ కేసులు గురించి ప్రజలకు తెలియజేస్తూ బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని తెలిపారు. ప్రజలకు మంచి జరగాలంటే టిడిపి తోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో టిడిపి అధికారాన్ని అడ్డుకోలేరని తెలిపారు. త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అర్ టి ఎస్ కన్వీనర్ దశరథరాముడు, అంజి, నాయకులు



రాఘవేంద్ర స్వామి, శివ, నరసింహరెడ్డి, హనుమేష్, హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రంలో అక్టోబరు 15 నుండి 24తేదీ వరకు దసరా మహోత్సవాలు

**శ్రీశైలం,నంద్యాల జిల్లా,**

అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ డి. పెద్దిరాజు ఆదేశాల మేరకు గురువారం సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి. మోహన్ తదితరులు కర్నూలు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. సృజన, కర్నూలు జిల్లా న్యాయమూర్తి ఎన్. శ్రీనివాసరావు, కర్నూలు రేంజ్ డి ఐజి ఎస్. సెంథిల్ కుమార్, కర్నూలు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ జి. కృష్ణకాంత్, ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీ తేజసాయి, ఆత్మకూరు డిఎస్పీ శ్రీనివాసరావు వార్లను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వారికి వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది.



# జొహరాపురం ప్రజల సమస్యలు తీరుస్తా.. టి.జి భరత్

**కర్నూలు, అక్టోబర్ 12(శ్రీచక్ర)**

జొహరాపురంలో నెలకొన్న సమస్యలన్నింటినీ తాను పరిష్కరిస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. తనను ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిపాలన సాగిస్తానని హామీ ఇచ్చారు. గురువారం జొహరాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడుతూ కర్నూలు నగరం అభివృద్ధి చెందాలంటే తనను గెలిపించాలని కోరారు. తాను గెలిచిన తర్వాత కర్నూలుకు పరిశ్రమలు తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క కంపెనీ వచ్చినా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ప్రజలు ఆలోచించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా చేసుకొని తన పనితీరు చూడాలని కోరుతున్నట్లు చెప్పారు. ఇక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకునే బాధ్యత తనదని టిజి భరత్ భరోసా ఇచ్చారు. కర్నూలు నగరంలోని ప్రజలు మురుగు కాలువల సమస్యతో పాటు, త్రాగునీటి కష్టాలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్



స్తంభాలు, వైర్లతో పాటు కనీస మౌలిక సదుపాయాలు లేక పడుతున్న ఇబ్బందులు తాను చూశానన్నారు. తాను గెలిచిన వెంటనే వీటన్నింటినీ పరిష్కరిస్తానని చెప్పారు. ఐదేళ్లకోసారి వచ్చే ఓటు హక్కును ప్రజలు సరైన విధంగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు ఇళ్ల పట్టాల సమస్యలు, పింఛన్ల సమస్యలు, మురుగు కాల్వల సమస్యలు ఆయనకు చెప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మోహన్, మాధవస్వామి, శ్రీనివాసులు, శాంతన్న, బలస్వామి, వెంకటయ్య, తిమ్మోజి, వెంకటేష్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్, శాంతమ్మ, చిట్టెమ్మ, ఎల్ల గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రె పై పులి పంజా !



**కోసిగి అక్టోబర్ 12 (శ్రీ చక్ర):-**

గొర్రెపై పులి దాడి చేసి చంపిన సంఘటన కోసిగి మండలంలో చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున 1 వార్డు చెందిన పెండేకంటి వీర రెడ్డి సంబంధించిన 20000 రూపాయలు విలువచేసే గొర్రెపై పులి దాడి చేసి చంపింది .గత మూడు సంవత్సరాల నుంచి కోసిగిలోని తిమ్మప్ప కొండ బసన్న కొండ ,రంగప్ప గొట్టుతదితరు ప్రాంతాల్లో పులులు సంచారం చేస్తున్న ఫారెస్ట్ అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయం చేయడం లేదు. కొండలలో ఉన్న కోతులను చంపి ఆహారంగా అలాగే కొండ చుట్టూ ఉన్న ప్రజలకు సంబంధించిన ఆవులు మేకలు గొర్రెలు కుక్కలపై తరచుగా పులులు దాడి చేసి చంపడం జరుగుతుంది. ఇంత జరుగుతున్న ఫారెస్ట్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులు మా ఇంటిలో ఉన్న చిన్నారుల పైన ,మాపైన జరిగితే పరిస్థితి ఏంటని వారు వాపోయారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పులులను ఫారెస్టు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా కాలనీ ప్రజలు కోరుకుంటున్నారు

# నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు

## ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



**ఓర్వకల్, అక్టోబర్ 12(శ్రీ చక్ర)**

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్లను పూర్తి చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా పెద్దాపురం మరియు సామర్లకోట గృహోత్సవాల్లో పాల్గొని వైయస్సార్ జగనన్న హౌసింగ్ కాలనీ లేఔట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఓర్వకల్లు మండల కేంద్రంలో ఉన్న వైయస్సార్ జగనన్న కాలనీ లేఔట్ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పాణ్యం ఎమ్మెల్యే మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులు ప్రారంభించారు.అనంతరం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి,కర్నూలు పార్లమెంట్ సభ్యులు ఎస్.సంజీవ్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్సీ మధుసూదన్,ఓర్వకల్ మండల జడ్పీటీసీ రంగనాథ్ గౌడ్, ఎంపీపీ తిప్పన్నమార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుండీల లెక్కింపు



**శ్రీశైలం, నంద్యాల జిల్లా,**

గురువారం న జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 3,17,50,290/- నగదుఎరాబడిగా లభించింది.కాగా ఆలయ హుండీల ఆదాయాన్ని భక్తులు గత 28 రోజులలో సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 187 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారు, 6 కేజీల 340 గ్రాముల వెండి లభించాయి.అదేవిధంగా 243 యుఎస్ డాలర్లు. 450 - ఆస్ట్రేలియా డాలర్లు, 40 కెనడా డాలర్లు. 15 - యూఏఈ దిర్హామ్స్, 6- సింగపూర్ డాలర్లు, 5 - యూరోప్ మొదలైన విదేశీ కరెన్సీ కూడా ఈ హుండీలు లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపులో కార్యనిర్వహణాధికారి శ్రీ పెద్దిరాజు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది మరియు శివసేవకులు పాల్గొన్నారు.

## బాబుతో నేను కార్యక్రమంలో నిర్వహించాలని గ్రామ నాయకులకు తెలియజేస్తున్న మండల అధ్యక్షులు




**శ్రీచక్ర- హనుమంతునిపాడు**

కనిగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం, హనుమంతునిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మనపల్లి, నందనవనం, వేములపాడు, గాయం వారిపల్లి గ్రామలో గ్రామ నాయకులతో సమావేశమై బాబుతో నేను కార్యక్రమాలు నిర్వహించడం గురించి వివరించడం జరిగింది. గాయంవారిపల్లి పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ నాగూరు, నాలి గంగాధర్ ను కలిసి క్యాస్ట్ వైట్ గా 120 ఓట్లకు ఒక అభ్యర్థిని నియమించి, బాబుకు నేను తోడుగా పాంప్లెట్లు పంపిణీ చేయమని చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం నాయకులు గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, దేవి రెడ్డి రాజారామిరెడ్డి పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో జనం సంతోషం

ఎమ్మెల్యే కేపీ



**శ్రీచక్ర మార్కాపురం**

మార్కాపురం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలంతా సంతోషం గా ఉన్నారని, అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులు కూడా ఉచితంగా ఇస్తారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జమ్మనపల్లి, కోల భీమునిపాడు,కె. కొత్తపల్లి, గ్రామలలో ఎంపీడీవో చందన ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఉద్దేశంతో జగనన్న ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాడని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండా వెంకటేశ్వర రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు సచివాలయంసిబ్బంది,వైద్యాధికారులు జె రోహిత్ నాయక్, డి హరీష్ రావు, యస్ డేవిడ్, బి ప్రసన్న రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

**శ్రీచక్ర, కనిగిరి**

రాజకీయాలకు అతీయంగా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. గురువారం కనిగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ అజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ కలష్ యాత్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థాయి నుండి పట్టణస్థాయి వరకు ప్రతి ఒక్కరూ మట్టిని సేకరించాలని స్వాతంత్రం కోసం పోరాడిన మహానేతల ఇండ్లకు వెళ్లి మట్టిని సేకరించాలన్నారు. పట్టణంలో సేకరించిన మట్టిని కళశాలతో పామూరు బస్టాండ్ నుండి పులి వెంకటరెడ్డి పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, కమీషనర్ డివిఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మునిసిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పథకానికి 2,50,000 వేల కోట్లు కేటాయించాలి- బడుగు వెంకటేశ్వర్లు

**శ్రీచక్ర- హనుమంతుని పాడు**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం నిర్వర్యం చేసే కుట్ర చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం 2,50,000 కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని ఉపాధి పని చేస్తున్న కూలీలకు కనీసం రోజుకు 600 తగ్గకుండా కూలివ్వాలని సంవత్సరములు 200 రోజులు పని కల్పించాలని పని ప్రదేశంలో మౌలిక వసతులు ప్రమాద భీమా తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాల్సి ఉందన్నారు. గత బడ్జెట్ లో పరిశీలిస్తే ఉపాధి చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నీరు కారుస్తుందని తెలియజేశారు. ప్రజల యొక్క కొనుగోలు శక్తి మార్కెట్ అభివృద్ధి ఉపాధి హామీ పథకం పై ఆధారపడి ఉందని జీవనోపాధి పెరగాలన్న మార్కెట్ ఉత్పత్తులు అభివృద్ధి కావాలన్నా వినియోగంలోకి రావాలన్నా ఉపాధి కూలీల చేతుల్లోకి డబ్బులు రావాల్సి ఉందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెంచేటువంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం మెరుగైనటువంటి ప్రజల జీవన స్థితిగతులు ఆరోగ్యం చూడలేదన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం తపిస్తున్నామని చెప్పే పాలకులు ముందు ఆకలి లేని దేశంగా చూడాల్సి ఉందన్నారు. దేశ ప్రజలు అర్ధాలతో పౌష్టికాహార లోపంతో బాల్యంలోనే భవిష్యత్తు విచ్ఛిన్నం అవుతుంటే ఉట్టికెక్కలేనమ్మ ఆకాశంకెక్కినట్లుగా మాట్లాడటం తగదు అన్నారు.ఇప్పటికైనా పాలకులు తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాల్సి ఉందని లేకుంటే ఎన్నికల సమయంలో ప్రజలు ఎవరిని ఎక్కడ ఉంచాలో నిరూపిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో




వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గురునాథం, రాములు,ఉపాధి కూలీల సంఘం నాయకులు కత్తి మత్తయ్య, కెవిపిఎస్ నాయకులు కత్తి ఏబు, సుబ్బులు,వినయ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజనం పథకం విద్యార్థులకు వరం

కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్

**శ్రీచక్ర, కనిగిరి**

ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం కనిగిరి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్నం భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు యొక్క హాజరుపట్టి రికార్డు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు స%శీ%ఖ్య ఆధారంగా భోజనం ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యారాలకు కు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మధ్యాహ్నం భోజనం పథకం మెనూ ప్రకారం తయారుచేయించి భోజనం అందించడజరుగుతుందన్నారు. భోజనంతోపాటు కోడిగుడ్డు రాగి జావా విద్యార్థులకు కడుపునిండా పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థులు దొడ్డు బియ్యం మధ్యాహ్నం భోజనం అందించేవారు దీంతో ఆహారం తినలేక చాలామంది విద్యార్థులు స్కూళ్లకు రాకపోవడం ఆగిపోయేవారు. చదువు మధ్యలో ఆగిపోగా బాల కార్మికులుగా మిగిలిపోయేవారు. వీటన్నిటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థులు భారత పౌరులుగా ఎదగాలని వారికి ఆకలి కేకులు రాకుండా రాష్ట్రం ఏర్పడిన వెంటనే మధ్యాహ్నం భోజనం సన్నబియ్యంతో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. దీంతో పాఠశాల విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరగడం జరుగుతుందన్నారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు సంఖ్య ఆధారంగానే నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించడం చాలా ఉపయోగకరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం



సంబంధించి అవసరమైన కిచెను షెడ్స్ మనబడి నాడు నేడు పథకం ద్వారా వంట గదులు నిర్మించడం జరిగిందన్నారు.పాఠశాలలో విద్యార్థులు కూర్చొని చదువుకొనుటకు మంచి టేబుల్స్ ఉండడం చాలా సంతోషకరమన్నారు.ప్రతి యొక్క విద్యార్థిని ఉన్నత శిఖరాలుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టారు విజయ లక్ష్మి ఉపాధ్యాయులు గోపి ,రంగారెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధిత వ్యక్తికి ఆర్థిక సహాయం అందించిన మానవతా సంస్థ

**శ్రీచక్ర, కనిగిరి**

రెండు కిడ్నీ లు చెడిపోయి ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న చంద్రకాంత్ పరిస్థితి గురించి తెలుసుకున్న మానవతా సంస్థ అభ్యర్థన మేరకు పలువురు దాతలు తమకు తోచిన విధంగా స్పందించి ఆర్థిక సహాయం అందించారు. దాతల ద్వారా అందిన మొత్తాన్ని చంద్రకాంత్ ఇంటివద్దకు వెళ్లి పరామర్శించి అతనికి ధైర్యం చెప్పడం చరిగినది. పిలవగానే చంద్రకాంత్ ఇంటివద్దకు వచ్చి అతని రిపోర్ట్స్ అన్ని చూసి తగిన సలహాలు ఇచ్చిన డాక్టర్ గురబ్రహ్మం మరియు డాక్టర్ పెరుగు మురళి కృష్ణ కనిగిరి మానవతా శాఖ ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతుంది. ఏపీ మెడికల్ కౌన్సిల్ కౌన్సిల్ మెంబెర్ డాక్టర్ పెరుగు మురళి కృష్ణ గారు చంద్రకాంత్ డయాలసిస్ పరిస్థితిని గురించి హాస్పిటల్ సిబ్బంది తో మాట్లాడడం జరిగినది. కనిగిరి ఇస్కాన్ మెంబెర్ మరియు మానవతా అధ్యక్షులు గుత్తి శ్రీధర్ గారు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో తాము మరికొంత సహాయం అందించగలమని తెలిపారు. మానవతా శాఖకు వచ్చిన మొత్తం విరాళం 27,500%తీం% ఇస్కాన్ సభ్యులు గుత్తి శ్రీధర్, డాక్టర్ గురు బ్రహ్మం, మరియు డాక్టర్ పెరుగు మురళి కృష్ణ, విజేత కరెస్పాండంట్ పసుపులేటి అరుణబో ధర్ గారి చేతుల మీదుగా చంద్రకాంత్ కు అందించడం జరిగినది.మానవతా కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు చిన్నవయస్సు లోనే అనారోగ్యం



బారిన పడిన చంద్రకాంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మానవతా సెక్రటరీ మారెళ్ల ఉమాకాంత్, ఆర్ ఎమ్ పి పచ్చవా చంద్రశేఖర్, విజేత కరెస్పాండంట్ పసుపులేటి అరుణో ధర్ లు మాట్లాడుతూ పోస్టింగ్ చూసి స్పందించిన దాతలందరికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫర్

**శ్రీచక్ర, కనిగిరి**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం స్థానిక కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ లో సచివాలయ ఆరోగ్య, వెల్ఫేర్ ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువయ్యేలా ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కనిగిరి పట్టణంలో ఈనెల 16న తేదీన గార్లపేట రోడ్ లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది కనుక సచివాలయం పరిధిలోని ప్రజలకు జగన్న సురక్ష కార్యక్రమంలో నాణ్యమైన వైద్యం అందించేందుకు వైద్యాధికారులు వస్తున్నారు ప్రతి ఒక్కరూ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలియ చేయాలని సచివాలయం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం హెల్త్ సెంటరీలు కే లక్ష్మి సమీన గౌస్ భీ వార్డు సంక్షేమ వెల్ఫేర్



కార్యదర్శులు వాసు మధు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దడమే జగనన్న లక్ష్యం

జడ్పిటిసి లెక్కల లక్ష్మీకాంతమ్మ

ప్రతి పేదవాడికి వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

మండల కన్వీనర్ దొంతి రెడ్డి వాసుదేవ రెడ్డి.

**శ్రీ చక్ర ఉదయగిరి దుత్తలూరు**

దుత్తలూరు మండలం లోని నాయుడుపల్లి సచివాలయ పరిధిలో వై.సి.పి మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి పేదవాడికి కార్పొరేట్ తరహా వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల వద్దకే పరిపాలన అనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను రూపకల్పన చేసి ప్రభుత్వ సేవలు నేరుగా గ్రామాల్లోని అందించే విధంగా కృషి చేశారని తెలిపారు. అదేవిధంగా నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య నిపుణులను క్షేత్రస్థాయిలో ప్రజలను వద్దకు పంపించి ప్రతి పేదవాడికి కార్పొరేట్ తరహా వైద్యం అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి వర్యులు ముఖ్యమంత్రివర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రతి పేదవాడికి పేదవాడికి వైద్య సేవలు ఉచితంగా అందించాలని ఆరోగ్య శ్రీ పథకం రూపకల్పన చేసి తద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రతి పేదవాడు కార్పొరేట్ హాస్పిటల్ కి వెళ్లి ఉచితంగా వైద్యం వైద్యం పొందడం జరిగిందని తెలిపారు. నేడు తండ్రికి తగ్గ తనయుడిగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా కార్పొరేట్ తరహా వైద్యం అందించి ప్రతి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అలాగే సచివాలయ పరిధిలోని ప్రజలందరూ ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా వైద్య సేవలు మరియు ఉచితంగా మందులు పొందాలని అన్నారు. అనంతరం జడ్పిటిసి లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా సురక్ష గ్రామాల్లోని ప్రజలందరూ ప్రజలందరూ ఉచితంగా వైద్య సేవలు పొందాలన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి తద్వారా పేద బడుగు బలహీన వర్గాలకు మైనారిటీలకు అందరికీ ప్రజలందరికీ కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తూ రాష్ట్ర ప్రజలం మన్నలు పొందుతున్నారని అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని



తెలిపారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా అందిస్తూ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ ఆదర్శంగా నిలుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు .ఈ కార్యక్రమంలో నందిపాడు సొసైటీ చైర్మన్ మండ్ల శివ జెడ్పీటీసీ లక్ష్మి కాంతమ్మ,మండల జేసీసీ కన్వీనర్ అన్నం రెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి , సీనియర్ నాయకులు లెక్కల మాలకొండ రెడ్డి , నుతేటి రంగయ్య నాయుడు ఎంపీటీసీ కలిచప్పిడి వెంకటేశ్వర్లు ఎంపీటీసీ ఒబులమ్మ , సర్పంచ్ కొండారెడ్డి,వెంగన్న పాలెం సర్పంచ్ వెంగాన్న, సచివాలయ కన్వీనర్లు వెంగల రెడ్డి, వినోద్,రత్తమ్మ,నాయకులు బంక ప్రసాద్ రెడ్డి,రామిరెడ్డి విజయ్ రామిరెడ్డి ,బంక సుబ్బారెడ్డి, పెద్దన్న, సీత రామిరెడ్డి, మాలకొండ రెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ చుండి.చైతన్య కుమార్ రెడ్డి, మండల,గ్రామ సచివాలయ కన్వీనర్లు ,ప్రజా ప్రతినిధులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు వైద్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులోకి తేవడమే జగనన్న లక్ష్యం

పాల్గొన్న మండల సొసైటీ అధ్యక్షులు రామాంజనేయులు, మండల కో ఆప్షన్ సభ్యులు జిలాని భాష, దాసరి ఎర్ర ఓబయ్య, జే సి ఎస్ కన్వీనర్ కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు

**శ్రీ చక్ర ఉదయగిరి వరికుంటపాడు**

వరికుంటపాడు మండలంలోని తోటల చెరువుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో స్థానిక గ్రామ సర్పంచ్ పెద్ద మౌలాలి, ఏం సి డైరెక్టర్ దాసరి ఎర్ర ఓబయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో చేవూరి శ్రీదేవి నేతృత్వంలో మండల వైద్యాధికారులు కరిష్మా ఆయేషా సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సొసైటీ అధ్యక్షులు గుంటుపల్లి రామాంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు జిలాని భాష, ఏఎంసీ డైరెక్టర్ దాసరి ఎర్ర ఓబయ్య, జే సి ఎస్ కన్వీనర్ బొద్దు వెంకటేశ్వర్ రెడ్డి, చెన్నంపల్లి సర్పంచ్ ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు. అనంతరం సొసైటీ అధ్యక్షులు అధ్యక్షులు గుంటుపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 45 రోజులపాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను 29 సెప్టెంబర్, 2023న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, తాడేపల్లి నుండి లాంఛనంగా ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు మండలంలోని తోటల చెరువుపల్లి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయంలోని ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఇటువంటి బహుత్రా కార్యక్రమం గతంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని అలాంటిది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేరుగా గ్రామానికి వైద్య నిపుణులు పంపించి వైద్య పరీక్షలు చేయించి వారి సూచనల మేరకు అవసరమైన మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని అన్నారు. అందువలన ప్రతి ఒక్కరు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్యాలను సురక్షితంగా కాపాడుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ పెద్ద మౌలాలి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం ఉచితంగా వైద్య పరీక్షలు - హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచితంగా స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు - మందులు - ఉచితంగా కళ్లద్దాలు, హెల్త్ ప్రొఫైల్ మ్యాపింగ్ తో పాటు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ , ఆరోగ్య ఆసరా పై అవగాహన, అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు పంపడం లాంటి జాగ్రత్తలతో పాటు వారు పూర్తి ఆరోగ్యవంతులయ్యేంతవరకు వారిని చేయి పట్టుకుని నడిపించే వినూత్న కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం ఏఎంసి డైరెక్టర్ దాసరి ఓబయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్యమే మహాభాగ్యం అనే లక్ష్యంతో రాష్ట్రంలోని ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలో స్థానిక సచివాలయ పరిధిలో వైద్య నిపుణులు చేత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ క్యాంపులో జనరల్ వైద్య నిపుణులు, కీళ్లు,ఎముకల వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, గైకాలజిస్ట్ నిపుణులు తదితరులు పాల్గొంటారని అన్నారు. అందువలన సచివాలయ పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్నటువంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కో ఆప్షన్ సభ్యులు జిలాని భాష మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజలకు అందించే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని అందుకు అనుగుణంగా సచివాలయ వ్యవస్థను రూపొందించి ప్రభుత్వ సేవలు నేరుగా సచివాలయం ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు తదితర అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే వైయస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రాథమిక చికిత్స కు సంబంధించిన సౌకర్యాలు అందించడం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ కార్యక్రమాలు నిధులు లబ్ధిదారుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందాలంటే స్థానిక నాయకులు చేత ఆమోదం పొందడం, లేక జన్మభూమి కమిటీ సభ్యులు చేత ఆమోదం పొందటం తదితర వ్యవహారాలు ఉండేయని కానీ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేరుగా సచివాలయ వ్యవస్థ ద్వారా వాలంటీర్ ద్వారా లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలే అకౌంట్లోకి జమ చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా



ప్రతి పేదవాడికి వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య నిపుణులు చేత రాష్ట్ర ప్రజలందరికీ వైద్యం అందిస్తున్నారని కొనియాడారు. అందువలన మండలంలోని ప్రజలు ప్రతి ఒక్కరు భవిష్యత్తులో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ తిరిగి వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని అలాగే ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి రాజగోపాల్ రెడ్డి ని గెలిపించుకోవాలని అన్నారు. అలాగే జ్ సి ఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల అన్ని రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించి తగు వైద్యం అందించడం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అందుకు సచివాలయ పరిధిలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చెన్నంపల్లి సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రక్తహీనత బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ మందులు, ఫుడ్ సప్లిమెంట్స్ కూడా ఉచితంగా జగనన్న ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. అనంతరం మండల ఎంపిడిఓ చేవురి శ్రీ దేవీ మాట్లాడుతూ స్థానిక మండల వైద్యాధికారులు కరిష్మా ఆయేషా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాలని అనారోగ్య బాధితులను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య నిపుణులు చేత పరీక్షించి వారి సూచనల మేరకు ప్రభుత్వం ఉచితంగా మందులు కూడా అందించడం జరుగుతుంది. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నిరంతరం వారిని సమీక్షించి ఎప్పటికప్పుడు డాక్టర్లు సూచనల మేరకు అవసరమైన మందులు ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పగడాల లక్ష్మమ్మ, కొండలరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సాయినాధుని ఆలయంలో పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

సుంకర వెంకటాద్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో

**శ్రీ చక్ర ఉదయగిరి వరికుంటపాడు**

వరికుంటపాడు మండల కేంద్రమైన వరికుంటపాడు లో సుంకర వెంకటాద్రి సృజన దంపతుల ఆధ్వర్యంలో నిర్మించినటువంటి సాయినాధుని ఆలయంలో గురువారం నాడు సుంకర వెంకటాద్రి సుజనా దంపతుల కుమారుడు సుంకర ఆదిత్య సాయి అన్నత దంపతుల కుమారుడు విరాట్ సాయి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయినాధునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి వచ్చినటువంటి భక్తులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చినటువంటి భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఎవరైనా ప్రతి గురువారం అన్నదానం చేయదలచిన వారు ఉంటే ముందస్తుగా ఆలయ కమిటీ సభ్యులకు తెలపాలని కోరారు.



## ప్రొద్దుటూరు లో అసాంఘిక కార్యక్రమాలన్నీ ఎమ్మెల్యే రాచమల్లు కనుసన్నల్లోనే

ప్రొద్దుటూరు టిడిపి ఇన్చార్జ్

డాక్టర్ జీ.వి ప్రవీణ్ కుమార్ రెడ్డి




**ప్రొద్దుటూరు, అక్టోబర్ 12 శ్రీచక్ర;**

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలన్నీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి కన్నుసన్నల్లోనే జరుగుతున్నాయని ప్రొద్దుటూరు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ జీ.వి ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిబి రోడ్డు లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యక్రమాలన్నీ ఎమ్మెల్యే రాచమల్లు కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్నారు. ఈ విషయమై తాను కాణిపాకం , మంత్రాలయం ఎక్కడైనా ప్రమాణానికి సిద్ధమని తెలిపారు. శివాలయం సర్కిల్ లో ప్రజల ముందు బహిరంగ చర్చకు తాను సిద్ధమని, ఎమ్మెల్యే రాచమల్లు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఏఎస్పీ కార్యాలయానికి వచ్చినా బహిరంగ చర్చలకు తాను సిద్ధమని తెలిపారు. ఏపీకి సీఎం జగన్ అని, కాని ప్రొద్దుటూరు కు సీఎం ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి అని ప్రముఖ క్రికెట్ బుకి మీ పక్కన కూర్చొని మాట్లాడలేదా అని పేర్కొన్నారు. 2020లో ఏఎస్పీ చక్రవర్తి ఉన్నప్పుడు జరిగిన సంఘటన గుర్తు లేదా అన్నారు. 2020లో ఎఫ్ఐఆర్ లో ఉన్న 23 మంది వద్ద ఏడు లక్షలు తీసుకున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. పోలీసులు ఒక్క రూపాయి తగ్గించరని ఆయన సొంత అనుచరుల దగ్గర డబ్బులు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మరో మారు తన కుటుంబం పైన వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఆరు నెలలుగా వారి కుటుంబంలో జరిగిన ప్రతి విషయాన్ని మీడియా ముందు ప్రవేశపెడతానని తెలిపారు. గతంలో తమ కుటుంబ సభ్యుల వద్దకు ఎమ్మెల్యే, ఆయన అన్న డబ్బుల కోసం ఎన్ని సార్లు వచ్చారో మర్చిపోయారా అన్నారు. మాజీ కౌన్సిలర్ సీతారామరెడ్డి బార్ %ఒ% రెస్టారెంట్ లో ఎమ్మెల్యే బామ్మర్ది ఏం చేశారో మరిచిపోయారా అన్నారు. ఎమ్మెల్యే సొంత నివాసంలో మద్యం సేవించి జూదగాలతో జూదం ఆడించలేదా, వారి ఇంటి చుట్టూ గ్యాంబ్లింగ్ నిర్వహించడం లేదా, మూడు నెలల్లో పోలీసులతో అసాంఘిక కార్యక్రమాలను లేకుండా చేస్తాననడం ఎందుకో చెప్పాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా అసాంఘిక కార్యక్రమాలకు బాసుగా ఉండి ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతానాన్ని చెప్పడం రాచమల్లు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. రసపుత్ర రజిని అరెస్టుకు ముందు రెండు రోజులు ముందు మీరు ఎన్నిసార్లు ఫోన్ చేశారో కాల్ డేటా ప్రజలకు చూపించాలన్నారు. స్వాతంత్ర సమరయోధుని కుటుంబం అని చెప్పే ఆయన, వారిపార్టీలో ఉన్న వారి సొంత అనుచరులకు ఎంతవరకు స్వాతంత్రం ఇచ్చావో చెప్పలా అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబీవుల్లా, రాజుపాలెం మండల టిడిపి అధ్యక్షుడు టంగుటూరు విశ్వనాథరెడ్డి, మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనివాసయాదవ్, నాయకులు పాల సుబ్బరాయుడు, మధుబాబు, గోలే మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# బాబుతో నేను ఇంటింటా ప్రచారం

మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంచల బాబు యాదవ్

**శ్రీ చక్ర ఉదయగిరి**



ఉదయగిరి నియోజకవర్గ లోని ఉదయగిరి మండలంలో పుల్లాయపల్లి పంచాయతీలో బాబుతో నేను కార్యక్రమం స్థానిక మండల కన్వీనర్ బయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల బాబు యాదవ్ పాల్గొన్నారు.అనంతరం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల బాబు యాదవ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ కక్షలో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి వర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్మెంట్ స్కీం లో ఎటువంటి అవినీతి జరక్కపోయినా జరిగినట్టుగా సృష్టించి సిఐడి ఉన్నతాధికారులను అడ్డం పెట్టుకొని తప్పుడు కేసు బనాయించారని మండిపడ్డారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎటువంటి అవినీతి మరకలేని నాయకుడు మాజీ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు అని అన్నారు .అటువంటి వ్యక్తిపై సైకో జగన్ రెడ్డి 16 నెలలు జైల్లో ఉన్నాడని అలాగే ప్రతిపక్ష నాయకులను కూడా అవినీతి మరకలు అంటించి జైల్లో పెట్టాలని ఉద్దేశంతో స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఇరికించి తప్పుడు కేసు బనాయించి జ్యూడిషియల్ రిమాండ్ కు పంపించారని తెలిపారు . దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లోనూ విజనరీ కలిగిన నేత ఎవరైనా ఉన్నారంటే అది ఒక మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. అటువంటి నాయకుడు ను 74 ఏళ్ల వయసులో రాజకీయ కక్షలో భాగంగా రిమాండ్ కు పంపించడం దురదృష్టకరమని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అనేక సంస్కరణలు తీసుకొని వచ్చి హైదరాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో ఒకటిగా గుర్తించే విధంగా కృషిచేసిన ఏకైక నాయకుడు మాజీ ముఖ్యమంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు . ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలనకు నాంది పలుకుతూ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తూ దౌర్జన్యాలు దాడులు ఇలా అనేక విధాలుగా రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తూ అభివృద్ధి లేని రాష్ట్రంగా , రాజధాని లేని రాష్ట్రంగా చేశారని సైకో జగన్ రెడ్డి పై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి చేస్తున్నటువంటి అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు . అనంతరం ఇంటింటికి వెళ్లి బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం జరగడం లేదని రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతుందని ఆయన వివరించారు. ప్రజలందరూ ఇది గమనించి వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ నరసింహులు యాదవ్ ,జల్సా ఏసుదాసు , వెంకటేశ్వర్లు మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# చదువుకునే విద్యార్థులకు కంటి పరీక్షలు తప్పనిసరి

జగనన్న ఆరోగ్య సురక్ష లో విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోండి...

ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్..

**భీమవరం, అక్టోబర్ 12 శ్రీచక్ర**

చదువుకునే విద్యార్థులలో ఎక్కువ శాతం మంది కి వారికి తెలియకుండానే కంటికి సంబంధించిన ఇబ్బందులు ఉంటాయని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుగానే జగనన్న కంటి వైద్య శిబిరాలను నిర్వహించారని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక పిఎస్ఎ మ్ గర్ల్స్ హైస్కూల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన ప్రజలు, విద్యార్థులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థిలే రేపటి దేశ భవిష్యత్తని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భావించి విద్యార్థుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకున్నారని అన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదువుపరంగా, అన్ని విధాలుగా పట్టించుకుంటారు గాని, వారిలో ఉన్న కంటి సమస్యలను మాత్రం గుర్తించలేరని, కానీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం విద్యార్థుల కంటి సమస్యలను సైతం గుర్తించడం, వాటి నివారణకు చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం వాడ వాడల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ వైద్య శిబిరాలలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేయడంతో పాటుగా అవసరమైతే రోగి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వైయస్సార్ ఆరోగ్యశ్రీ ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు సంబంధిత రోగిని తీసుకువెళ్లి వారికి ఉచితంగా వైద్యం చేయించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. మరో ప్రక్క వృద్ధులకు, అదే మాదిరిగా కంటి వ్యాధితో బాధపడుతున్న వారిని ఈ శిబిరాలలో పరీక్షించి అవసరమైతే వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడంతో పాటుగా కళ్ళజోళ్లను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**మున్సిపల్ కమిషనర్ పై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి ఆగ్రహం..**

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీ లేకపోవడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ ఎం



శ్యామల పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్యామల, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు ,కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, మెంటే బలరాం, షేక్ రబ్బాని ,కోడే యుగంధర్, నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, గాదిరాజు రామరాజు, కట్టా రవి, ములపర్తి స్వామి, గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, ముల్లి నర్సింహమూర్తి, ముత్యాల రామరావు, కోళ్ల బాలకృష్ణ, మాదాసు రంగబాబు, భలే ఏసుబాబు, శేషాద్రి హరిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నాం....

ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



**భీమవరం అక్టోబర్ 12 శ్రీచక్ర**

ప్రతి గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం కొమరాడ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు రూ 10 లక్షల నిధులతో గొర్ల మూడి చర్చి వద్ద నిర్మించే రెండు సిసి రోడ్లకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గ్రామంలో సచివాలయం వద్ద సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సందర్శించారు. శిబిరానికి వచ్చిన ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జడ్పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి, పార్టీ గ్రామ అధ్యక్షులు బేతాళ సంతోష్, గ్రామ ఉప సర్పంచ్ రాట్నాల పేరయ్య, ఎంపీటీసీ మైనపు వెంకటేశ్వరరావు, రాట్నాల సత్యనారాయణ, కొప్పర్తి సత్యనారాయణ, సర్పంచులు కోళ్ల బాలకృష్ణ, జల్లా కొండయ్య నాగిడి నారాయణస్వామి అనా కోడేరు రవిరాజు, తిరుమాని ధనుంజయ, తోట భోగయ్య, గ్రంధి గోపి, రాట్నాల నాగేశ్వరరావు, కోమటి రాంబాబు, నామన మహేష్, కాకిలేటి బాసు తదితర నాయకులు పాల్గొన్నారు.

# బాలింతలకు గర్భిణీ స్త్రీలకు,క్రమం తప్పకుండా వైద్య సేవలు చేయించుకోవాలి.

సూపర్వైజర్ కనకమహాలక్ష్మి



**వీరవాసరం అక్టోబర్ 12 శ్రీ చక్ర**

గర్భిణీలకు బాలింతలకు, అన్నం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కనక మహాలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మత్స్యపురి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న గర్భిణీ స్త్రీలకు అంగన్వాడి సూపర్వైజర్ టీచర్లు, దగ్గర ఉండి వైద్య పరీక్షలు. చేయించారు. అదేవిధంగా అంగన్వాడి సెంట్రర్ ద్వారా అందిస్తున్న పోషకాహారం తప్పనిసరిగా తీసుకుని ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ , వి కనకమహాలక్ష్మి, టీచర్లు సిహెచ్ ఎలిసమ్మ సిహెచ్ భారతి పి ఎస్ ఆర్ రాణి పి కళ్యాణి ఎం కృష్ణవేణి కె స్వరూప రాణి, హెల్పర్లు కే మెర్సి బి సావిత్రి ఎస్ రామలక్ష్మి ఏ అన్నపూర్ణ, పి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి సప్త నది జలాభిషేక పూర్వక పవిత్రోత్సవములు.

**భీమవరం అక్టోబర్ 12 శ్రీచక్ర**

స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం. కాళ్ళకూరు.లో గురువారం వేద మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రధాన అర్చకులు, బ్రహ్మశ్రీ సింహాద్రి అప్పలాచార్యులు మరియు నరసింహచార్యులు వేద పండితులు బ్రహ్మశ్రీ ఫణి కుమార్ శర్మ , శ్రీ వెంకటరమణ ఆచార్యత్వమున శ్రీ స్వామి వారికి సప్త నది జలాభిషేక పూర్వక పవిత్రోత్సవములలో ఉ.గం:08-30లకు చతుర్వేదస్వస్తి , విశ్వక్సేన పూజ, యాగశాలార్చన, ప్రాయశ్చిత్త హెూమములు, శ్రీ నారసింహ సుదర్శన హెూమములు,నీరాజన మంత్రపుష్పములు జరిగినవి, సాయంత్రం గం:06-30లకు యాగశాల అర్చన, పంచసూక్త హవనములు, పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహా పూర్ణాహుతి ఘనంగా జరిగినది. అనంతరం చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ ఘనంగా జరిగినవి. ఈ కార్యక్రమానికి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ దండు. వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు గ్రామస్తులు పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ మోకా. అరుణ్ కుమార్ మరియు సిబ్బంది తగిన ఏర్పాట్లను చేసినారు.



# ముఖ్యమంత్రి సభకు ప్రత్తిపాడు నుండి స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు

ప్రజలు కార్యకర్తలు నాయకులు కలిసి 5000 పై మాట హాజరు..

**ప్రత్తిపాడు : అక్టోబర్ ( శ్రీ చక్ర)**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సామర్లకోట మండలంలో జగనన్న కాలనీ ప్రారంభోత్సవం, అలాగే బహిరంగ సభ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం లోని ఒక్క ప్రత్తిపాడు మండలం నుండి 68 బస్సుల ద్వారా 3,4 80 మంది మహిళలు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. ఈ బస్సులు ప్రత్తిపాడు లోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్తిపాడు శాసనసభ్యులు పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఊపి ప్రారంభించారు. నియోజవర్గవ్యాప్తంగా ప్రజలు నాయకులు కార్యకర్తలు సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు సొసైటీ డైరెక్టర్లు అధ్యక్షులు పార్టీ కన్వీనర్లు సచివాలయ కన్వీనర్లు, గృహరధ సారధులు, ఇతర వాలంటీర్లు ఇతర నాయకులు సిబ్బంది భారీ ఎత్తున 5000 మందిపైగా ముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ ప్రజలకు అవగాహన ఏర్పడి ప్రభుత్వం అందించే పథకాలు ప్రభుత్వం పెట్టే కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి లభించే ఇతర స్కీములు అందించే ప్రదాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. మన ప్రాంతానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి జగనన్నను చూసేందుకు స్వచ్ఛందంగా తరలి వెళ్తున్న తమకు మండల అభివృద్ధి అధికారిలు, స్థానిక శాసనసభ్యులు పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్ బస్సు సదుపాయం కల్పించి చక్కని ఆహారాన్ని అందించినందుకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ఎండా వాన తారతమ్యం లేకుండా అలుపెరుగని నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆయన కష్టాన్ని చూసి ప్రతీ ఒక్కరు ప్రతి అమ్మ ప్రతి అక్క ప్రతి చెల్లి ప్రతి అన్న కూడా గర్వపడే విధంగా పరిపాలన అందిస్తున్నారని పలువురు కొనియాడారు. ఈ సభా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తరలి వెళ్తున్న ప్రజలకు కృషి చేసిన అధికారులకు ఎమ్మెల్యే పర్వత అభినందించారు. ప్రతిపాడు విద్యుత్ సబ్స్టేషన్ వద్ద జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు గ్రామ



సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం, ఎంపీపీ గోళ్ళ క్రాంతి సుధాకర్, జేసీఎస్ చైర్మన్ రామిశెట్టి చినబాబు, మార్కెట్ కమిటీ ఉప చైర్మన్ సేరు కృష్ణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రెడ్నం వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ళ జయ శేఖర్ బాబు, వైకాపా జిల్లా కార్యదర్శి ఆకుల వీరబాబు, దాడిశెట్టి చక్రధర్, మామిడి నరసింహమూర్తి, చలంకూరి రాజబాబు, రెడ్డి నాయుడు, ముత్యాల రాంబాబు, అలాగే ప్రత్తిపాడు మండల అభివృద్ధి అధికారి ఎమ్. విజయ రత్నకుమార్ బాబు, ఇన్చార్జిఓపిఆర్డి ద్విభాష్యం శ్రీనివాసరావు, వైయస్సార్ క్రాంతి పదం ఏపిఎం ఇనుగంటి వెంకట్, ఇతర సిబ్బంది నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ చక్ర సహిత జగన్మాత కనకదుర్గ అమ్మవారి దేవి శరన్నవరాత్రులుకు శ్రీకారం

భీమవరం పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలయ నిర్వహణ అధ్యక్షుడు మల్లికార్జునరావు ( మల్లిక్)

**భీమవరం అక్టోబర్ 12, శ్రీ చక్ర**

.పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో 33 వార్డ్ శ్రీరాంపురంలో భక్తుల కొంగుబంగారంగా వెదజల్లుతున్న శ్రీ చక్ర సహిత జగన్మాత కనకదుర్గ అమ్మవారి ఆలయం లో దేవి శరన్నవరాత్రులు కు గత నెలరోజులుగా ఎంతో చక్కని పెయింట్లు ద్వారా ఆలయం కళాత్మకంగా ఆలయం రూపు దిద్దుకుంది అని భీమవరం పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జోష్యుల మల్లికార్జునరావు ( మల్లిక్) అన్నారు. ఈ మేరకు భీమవరం శ్రీ చక్ర సహిత జగన్మాత కనకదుర్గ అమ్మవారి ఆలయం దేవి శరన్నవరాత్రులు ఆలయ ప్రాంగణం సుందరీకరణలో భీమవరం పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జోష్యుల మల్లికార్జునరావు మీడియాతో మాట్లాడారు. రానున్న 15 తారీకు నుండి 23 తారీకు వరకు దసరా ఉత్సవాల్లో అమ్మవార్లకు అనేక అలంకరణలు తో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని అని అన్నారు. కార్యక్రమాలకు భక్తులు



దాతలు చేసే సహాయం చాలా అభినందనీయమని అమ్మవారి కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లంక నాగరాజు, రాజేష్, పితాని సత్యనారాయణ, పడమట దుర్గారావు పాల్గొన్నారు

# పాలకోడేరు మండలంలో నా భూమి నా దేశం. మట్టి కలశాలు ఢిల్లీకి.

-భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఇంజేటి వెంకటేశ్వర్లు.

**భీమవరం అక్టోబర్ 12 శ్రీచక్ర**

భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఇంజేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా పాల కోడేరు మండలంలో సేకరించిన మట్టి కలశాలను ఢిల్లీకి పంపించే కార్యక్రమంలో భాగంగా ఉండి అసెంబ్లీ పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామం రామాలయం నుండి ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఊరేగింపు జరిపి ఆ కలశాలను పాలకోడేరు మండల బిజెపి అధ్యక్షులు ఐ కె రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఇంజేటి వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి ప్రసాదం ఏడుకొండలు జిల్లా కోశాధికారి పాకెర్ల హరిప్రసాద్ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు తులసి భగవాన్ రాజు బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి చెన్నం శెట్టి నాగరాజు షేక్ షఫీ బిజెపి మండల ఉపాధ్యక్షులు నీలి గోపాలకృష్ణ బూత్ కమిటీ సభ్యులు గడ్డం శాంతారావు





ఇంజేటి జీవామణి పితాని పెద్దిరాజు ఇంజేటి రఘుపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిన్న వాడైనా ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారు : మంత్రి రోజా

**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవరత్నాలలో భాగమైన - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్ళ సామూహిక గృహ ప్రవేశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోట ప్రారంభించిన నేపథ్యంలో తిరుపతి జిల్లాలో వడమాల పేట మండలంలోని జగనన్న కాలనీ - కాయం లేఔట్ నందు ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసార వీక్షణ ఏర్పాటు చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కలని నెరవేర్చిన జగనన్నకి పేద వాళ్ళందరి తరపున పాదాభివందనం చేస్తున్న అని అన్నారు. ఇక్కడ నిర్మించిన ఇళ్లు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క సంక్షేమ పథకం ఇవ్వాలన్న ఏదైనా కూడా మహిళ పేరుమీద ఇచ్చి ఆ ఇంట్లో మహిళకి గౌరవం కల్పించడం చూస్తే మనం మనస్ఫూర్తిగా జగన్ అన్నని మహిళా పక్షపాత ముఖ్యమంత్రి అని కూడా చెబుతాం అని అన్నారు. ఈరోజు జగన్మోహన్ రెడ్డి సచివాలయ వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ఇంటింటికి వాలంటీర్లు పంపించి ఎవరికీ హౌస్ కావాలి వాళ్లు ఆ హౌసింగ్ కి ఎలిజిబిలిటీ ఉందా లేదా అని వెరిఫై చేసి పార్టీ చూడకుండా కులం చూడకుండా మతం చూడకుండా వారికి ఇంటి పట్టా ఇచ్చి ఇల్లు కట్టిస్తున్నారు అని కొనియాడారు. ఈ ఇంటిని మీకు అందిస్తూ ఇల్లు కట్టిస్తున్నారు. ఈరోజు మీరు చూస్తే ఈ ఇంటికి కాస్ట్ పట్టా కాస్ట్ మీరు తీసుకుంటే ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క లా ఉండొచ్చు అది మీరు చూస్తే రూరల్ లో ఎక్కడ ఇంటీరియర్ ఉంటే మినిమం 2.5 లాకన్నా ఉంటుంది ఈరోజు ల్యాండ్ కాస్ట్ ఎలా ఉందో మీరు చూశారు ఇప్పుడు మనం ఇక్కడ ఓపెన్ చేసుకుంటుండేది తిరుపతికి దగ్గర్లో ఉంది రేపు చక్కగా మీరు ఇల్లు కట్టుకుంటే 15 లక్షలు అమ్ముకునే పరిస్థితి అంటే ఇంటి పట్టా రెండు. ఐదు లక్షల నుంచి పదిహేను లక్షల వరకు ఆ ప్రాంతం బట్టి మునిసిపాలిట రూరల్ అనేదాన్ని బట్టి ఉంటుంది అలా మీరు తీసుకున్న ఈరోజు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఈ 31



లక్షల ఇళ్ల పట్టాలకి ఎంత ఖర్చయిందో తెలిస్తే ఆశ్చర్యంతో నోరు తెరుస్తారు. ఎందుకంటే అది దాదాపుగా ఈరోజు మీరు చూస్తే 175 వైయస్సార్ జగనన్న కాలనీ లేఔట్స్ లో దాదాపుగా ఈ రెండో పాయింట్ 5 లక్షల పెట్టుకుందాం ఎందుకంటే 15 లక్షల కూడా వద్దు. రెండో పాయింట్ 5 లక్షల చొప్పున మనం గనక ఈ 31 లక్షల హౌసెస్ కి గనక ఎంత అవుతుందని లెక్కవేస్తే 76 వేల కోట్ల రూపాయలు అవుతుంది ఈ రాష్ట్ర పేద అక్కాచెల్లెళ్ల కోసం ఇంటి పట్టాల విలువ 76 వేల రూపాయలు ఖర్చుపెట్టి ఈరోజు జగన్మోహన్ రెడ్డి మీకు ఇచ్చారన్న విషయాన్ని జీవితంలో మీరు ఎప్పుడు మర్చిపోకూడదని అన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి ఆరోగ్య వంతులు చేయడం మా లక్ష్యం -మేయర్ శిరీష

**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబ సభ్యులకు మంచి ఆరోగ్యం లక్ష్యంగా ఏర్పాటు చేసిన సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష కోరారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 47 డివిజన్ జర్నలిస్ట్ కాలనీ, ఎర్రమిట్ట లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ లో గురువారం నగర మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైద్యం కోసం పేదవాళ్లు అప్పులు పాలయ్యే పరిస్థితి రాకూడదని, ఆరోగ్య సురక్ష క్యాంప్ ద్వారా చికిత్సలను అందిస్తున్నామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా. వారిని గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్ చేత వారికి చికిత్స అందిస్తున్నామని, తర్వాత వారికి అవసరమైన పరీక్షలు కూడా చేయించి, వారిని ఇంటి వద్దకు సురక్షితంగా తీసుకువెళ్లి అప్పజెప్పడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, ఆరోగ్య సావన్ వదిన తర్వాత సంబంధిత పేషెంట్లకు అవసరమైన మందులు అందేలా చూస్తున్నామని తెలియజేశారు. ఆరోగ్య సురక్ష సభలో గురువారం నిర్వహించిన క్యాంపులో 17వందల మంది చేసుకున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కార్యదర్శి రాధిక రెడ్డి, సూపర్డెంట్ రవి,




రెవిన్యూ ఇన్స్పెక్టర్ సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ, డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ వైద్యానికి ధీటుగా జగనన్న వైద్య శిబిరాలు కమిషనర్ హరిత

**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

కార్పొరేట్ హాస్పిటల్స్ లో అందించే వైద్యానికి ధీటుగా జగనన్న వైద్య శిబిరాల్లో వైద్యం అందిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 8, 43 వార్డులకు సంబంధించి జర్నలిస్ట్ కాలనీలోని సచివాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ లో కమిషనర్ హరిత పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ప్రజల ఆరోగ్య భద్రత కోసం పెద్ద పీట వేస్తూ జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు నగరంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చిన్నపిల్లలకు, గర్భిణీ స్త్రీ సమస్యలు, జనరల్ మెడిసిన్, కంటి వైద్యం అందిస్తున్నారని అన్నారు. అలాగే అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్ కు ధీటుగా ఈ వైద్య శిబిరాల్లో వైద్యం అందిస్తున్నామని అన్నారు. ముందుగా ప్రతి ఇంటికి వాలంటీర్, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు వచ్చి బి.పి., రక్త పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వారికి టోకెన్ ఇచ్చి, ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నామని అన్నారు. ప్రజలు నేరుగా వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చు అన్నారు. గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు వెయ్యి మంది సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. ప్రజలందరూ



ఈ జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సెక్రెటరీ రాధిక, సూపరింటెండెంట్ రవి, వైద్యులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ డెక్కర్ బస్ ప్రారంభం. జెండా ఊపి ప్రారంభించిన టిటిడి ఛైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు

**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ బస్సును టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, అభినయ రెడ్డి లు గురువారం ఉదయం జెండా ఊపి ప్రారంభించారు. ఎస్.పి.జే.ఎన్.ఎం. క్రీడా మైదానంలో ఈ బస్ ను ప్రారంభించారు. అక్కడ నుండి జ్యోతి థియేటర్ కూడలి, టౌన్ క్లబ్, ఎస్వీ యూనివర్సిటీ వరకు వెళ్లి అక్కడ నుండి టౌన్ క్లబ్ కూడలి మీదుగా అలిపిరి కూడలి, కపిలతీర్థం కూడలి వరకు వెళ్ళి శ్రీనివాస సేతు మీదుగా మామిడి కాయల మంది వరకు, అక్కడ నుండి తిరిగి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ ఆలయం వరకు ఈ బస్ లో టిటిడి ఛైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు ప్రయాణించారు. అనంతరం గంగమ్మ ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా ఈ డబుల్ డెక్కర్ బస్ ను తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. తిరుపతి నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నదని, కౌన్సిల్ ఆమోదంతో ఈ బస్ ను నగరపాలక సంస్థ కొనుగోలు చేశామన్నారు. ఈ




నేపథ్యంలో ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి అందాలను వీక్షించేందుకు వీలుగా ఈ డబుల్ డెక్కర్ బస్ ను ఏర్పాటు చేశామని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ బస్ నాలుగు మార్గాల్లో నడపనున్నామని అన్నారు. ఈ ఎలక్ట్రిక్ ఏ.సి. బస్ నిర్వహణను పరీక్షించిన తరువాత మరో నాలుగు బస్సులను అందుబాటులోనికి తెస్తామని అన్నారు. ఈ బస్ లో ప్రయానించండం కొత్త అనుభూతిని కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సారా బట్టీలు పై దాడులు..

## ఒకరు అరెస్టు

**ప్రత్తిపాడు: అక్టోబర్ 12 (శ్రీ చక్ర)**



కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ..డాక్టర్ ప్రేమ్ కాజల్ ఆదేశాల ప్రకారం ప్రత్తిపాడు స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలో గల ప్రత్తిపాడుమండలం పెద్దిపాలెం గ్రామం లోగల ఏలేరు కాలవ సమీపంలో 200 లీ నాటు సారాయి తయారీకి పనికి వచ్చే పులిసిన బెల్లపుఊట నుధ్వంసం చేసి 05 లీ నాటు సారాయి నీ స్వాధీన పరుచుకున్నారు. ఈ కేసులో నిందితుడు బొందల వీర కుమార్ , పెద్దిపాలెం అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడమైనది,అని ప్రత్తిపాడు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. సిబ్బంది సంయుక్తంగా కలిసి మరిన్ని దాడులు చేపట్టారు అన్నారు.ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలను అరికట్టాలి. సమాజంలో యువత పెడదారిని పెట్టకుండా ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాలను అరికట్టాలిఅని ప్రత్తిపాడు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.అశోక్ యువతకు పిలుపునిచ్చారు. ఏలేశ్వరం లో గల ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో విద్యార్థి విద్యార్థినులకు మాదక ద్రవ్యాలు నిర్మూలనకు మరియు నాటు సారాయి, గంజాయి నిర్మూలన కొరకు అవగాహన సదస్సు నిర్వహించి ప్రమాణాలు చేయించడ%శీ% జరిగినదని ప్రతిపాడు సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. అశోక్ తెలిపినారు. ఈ దాడుల్లో, అవగాహన కార్యక్రమం లో స్థానిక ప్రత్తిపాడు సేబ్ ఎస్. ఐ.బి శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్. వెంకన్న దొర , కానిస్టేబుల్స్,దొరబాబు, రాజు, రాంబాబు,వెంకటేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

# శ్రామిక,కార్మిక కష్ట జీవులంటే నాకు ఎంతో ఇష్టం, ఎనలేని గౌరవం...భూమన



**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వాళ్లకు సేవ చేయడానికి ఏ చిన్న అవకాశం దొరికినా వారికి సేవ చేయడానికి వెనుకాడే ప్రసక్తే లేదు.మీకు వేతనాలు పెరగడంలో అండగా నిలబడిన మహానుభావుడు టీటీడీ ఈవో ధర్మారెడ్డి. కార్మికుల వేతనాల గురించి చెప్పగానే మరొక్క మాట కూడా మాట్లాడ కుండా అలాగేనన్నా అన్నారు. నాకు కొంత ఊపిరి పీల్చుకునే సమయం ఇవ్వండి, మీకు మరింత మెరుగైన జీవితాన్ని ఇవ్వడానికి శాయ శక్తులా ప్రయత్నిస్తాను. నేనూ అనేక ఉద్యమాలు చేశాను, జైళ్లకు కూడా వెళ్లాను. ఉద్యమాలు చేసినంత సులభంగా ఒక్కోసారి పనులు కావు. టీటీడీ అంటేనే ఒక్కడిగా కాదు, అంతా కలిసి సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. మీకు మంచి జరగడం కోసమే అన్ని విధాలా ప్రయత్నిస్తా. మీకు జీతాలు పెరిగినందుకు మీ కంటే ఎక్కువగా సంతోష పడుతున్న వాడిని నేనే. రాజకీయాల కోసం పనిచేసే వాడిని కాదు. నా వల్ల ఇంత మంచి జరిగిందంటే నాకు ఎంతో ఆనందం, చాలా తృప్తిగానూ ఉంది. టీటీడీలో పనిచేస్తున్న తమ వేతనాలు పెంచిన నేపథ్యంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి - సీపీఎం నాయకులు కందారపు మురళి, వందవాసి నాగరాజు, సుబ్రమణ్యం నేతృత్వంలో భూమనకు గురువారమిక్కడ ధన్యవాదాలు తెలిపిన నేపథ్యంలో... కాంట్రాక్ట్ కార్మికులతో భూమన కరుణాకర రెడ్డి ఈ రకంగా స్పందించారు.

# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వైభవంగా ముగిసిన పవిత్రోత్సవాలు

**తిరుచానూరు, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన చేపట్టారు. ఆ తరువాత యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం తిరువీధి ఉత్సవం జరిగింది. సాయంత్రం 6 గంటల నుండి జరిగే పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏవీఎస్ఓ శైలేంద్ర బాబు, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, కంకణబట్టర్ తిప్పయాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ పద్మావతి అమ్మవారి సేవలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గ

**తిరుచానూరు, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద సూపరింటెండెంట్ శేషగిరి, మధుసూదన్ వి.ఐ.రామ్మోహన్, ఇన్స్పెక్టర్ ప్రసాద్, అశోక్, గణేష్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# శ్రీ పద్మావతి అమ్మవారి సేవలో అపోలో చైర్మన్ ప్రతాప్ రెడ్డి



**తిరుచానూరు, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని అపోలో చైర్మన్ ప్రతాపరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద సూపరింటెండెంట్ శేషగిరి, మధుసూదన్ వి.ఐ.రామ్మోహన్, ఇన్స్పెక్టర్ ప్రసాద్, అశోక్, గణేష్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్న వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# బంగారు పేటలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి

బంగారు పేటలో నేదురుమల్లికి వినతి

**శ్రీ చక్ర వెంకటగిరి**



తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి రెండు వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గం సమయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తిరిగి సమస్యను అడిగి తెలుసుకునే క్రమంలో బంగారు పేట ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థి నరేంద్ర బంగారుపేట ప్రాంతానికి క్రీడా ప్రాంగణం లేదని అడగగా నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి స్పందించి బంగారు పేట ప్రాంతానికి త్వరలోనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తానని తెలిపారు.

# కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నేదురుమల్లి ఆధ్వర్యంలో

**శ్రీ చక్ర వెంకటగిరి**



తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని బంగారు పేట 1- 2 వార్డులలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఏర్పాటుచేసిన అధికారులు ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ బోర్డ్ చైర్మన్ తిరుపతి జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి గడప గడప తిరుగుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు గురించి వివరిస్తూ ప్రజల వద్ద నుండి సమస్యలను అడిగి తెలుసుకుంటూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా రెండో వార్డ్ లో తాగునీరు సైడ్ కాలువలు సిమెంట్ రోడ్లు సక్రమంగా లేవని మా సమస్యలను పట్టించుకొని వెంటనే పరిష్కరించాలని ఆ ప్రాంత మహిళలు కోరారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి అధికారులను పిలిచి వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని అధికారులకు నేదురుమల్లి ఆదేశించారు. ఆ ప్రాంత ప్రజలు సైడు కాలువలలో వ్యర్థ వస్తువులు నిలబడడం వల్ల సైడ్ కాలువ ద్వారా భయంకరమైన దుర్వాసన వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అధికారులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

# శిల్పారామంలో వైయస్సార్ టి యు సి ఆత్మీయ సమావేశం పాల్గొన్న చంద్రగిరి వైయస్సార్సీపి ఎమ్మెల్యే అభ్యర్థి, చెవిరెడ్డి మోహిత్

**తిరుచానూరు అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

తిరుచానూరు వద్దగల శిల్పారామంలో వైయస్సార్ టి యు సి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన టిటిడి బోర్డు మెంబర్ల సమావేశంలో ఔట్సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఏపీఎస్ఎఫ్ఎల్ కార్పొరేషన్ చైర్మన్ డా. పూనూరు గౌతమ్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి మునిసిపల్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూనూరు గౌతమ్ రెడ్డి,చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి ఎల్లవేళలా కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని స్పష్టం చేశారు. టీటీడీ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలను విన్న వెంటనే చలించి పోయి వారి జీతాలను పెంచడానికి పచ్చ జెండా ఊపారని అన్నారు. మిగిలిన డిమాండ్లను సైతం త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ టి.యు.సి జోనల్ ఇంచార్జ్ నారపరెడ్డి రాజారెడ్డి,జిల్లా అధ్యక్షులు ఏ. ఉపేంద్ర రెడ్డి,శ్రీనివాస రెడ్డి, చిన్నమ్మ వైసిపి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి హయాంలో బీసీలకు స్వర్ణ యుగం

వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబు ఎంతో కృషి చేశారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్

**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీలకు స్వర్ణ యుగంలా నడిచిందని.., అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వెనుకబడిన వర్గాల వారిని అన్ని రకాల అణచివేస్తున్నారని తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్ ఆరోపించారు. గురువారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. బీసీలు అంటేనే తెలుగుదేశం పార్టీ అని నాడే నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు నిరూపించారని గుర్తు చేశారు. ఇకపోతే టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల పక్షపాతిగా పనిచేసి, వెనుకబడిన వర్గాలకి అధిక ప్రాధాన్యత నిచ్చారని తెలియజేశారు. సమన్యాయం పాటిస్తూ..,రాజకీయంగా ఎదిగేందుకు చేయూతని ఇచ్చారని వివరించారు. సామాజిక న్యాయమనే పదానికి పరమార్థాన్ని తెలియజేసిన మహోన్నత వ్యక్తి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైయస్ జగన్మోహన్ రెడ్డి కుట్ర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా మారి, బీసీలను అణచివేచ్చేందుకు కుయుక్తులు పన్నారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన ప్రతి బీసీ నేతను అక్రమంగా అరెస్టు చేయించి జైళ్లలో పెట్టించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే.. ,బీసీలు అంటే జగన్ రెడ్డికి గిట్టడం లేదనే విషయం అర్థమవుతుందన్నారు. టిడిపి హాయంలో కులవృత్తులను,



చేతివృత్తుల వారిని అన్ని రకాలుగా ప్రోత్సహిస్తే..,వైకాపా ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం జగన్ ప్రభుత్వ నియంతృత్వ పోవడలకు నిదర్శనం అన్నారు. ఏది ఏమైనా ప్రజారంజకంగా పాలించని వైకాపా సర్కార్కు చరమగీతం పాడేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని నరసింహా యాదవ్ హెచ్చరించారు.

# లోకల్, నేషనల్, ఇంటర్నేషనల్ క్రిమినల్ జగన్

మంగమ్మ గారి మునిమనవడు జగన్ రెడ్డి..

సున్న, సున్నా కలిపి చెప్పనికి కూడా చీటీ చూసి చెప్పే ముఖ్యమంత్రి నువ్వు.. జనసేన నేత కిరణ్ రాయల్..

**తిరుపతి, అక్టోబర్ 12 (శ్రీచక్ర)**

సిఎం జగన్ మా అధినేత పవన్ కళ్యాణ్ పై అవాకులు చవాకులు పేలడం తప్ప ఢిల్లీ కి వెళ్లి ఏమి చేశాడో, ఎందుకు వెళ్ళాడో చెప్పడు ఎందుకు! టిడిపి, జనసేన అలయెన్స్ తర్వాత ఫ్రస్టేషన్ ఎక్కువైపోయాయి జగన్ రెడ్డి మాట్లాడుతున్నాడని, అలయెన్స్ కుదరటంతో చ్చపోసుకుంటున్నాడు జగన్ ముత్తాతకు భార్య వుండగానే, మంగమ్మ అనే మహిళను చేరదీశాడని, అమెకు పుట్టిన వ్యక్తి రాజారెడ్డి అని ఆ సంతతి కి వారసుడు సీఎం జగన్ అని, జగన్మోహన్ రెడ్డి మంగమ్మ గారి మనవడు అని, నీ కుటుంబ సభ్యులనడిగితే నీ చరిత్ర చెబుతారని, మీ బిడ్డ గురించి మీ తల్లి విజయమ్మ ను అడిగితే చెబుతుందని, ప్రతి ఒక్కటి చీటి చూసి చదువుతుంటే ప్రజలు చూసి నవ్వుకుంటున్నారని, మా నాయకుడి వివాహం వల్ల. ఎవ్వరికి నష్టం లేదని, లోకల్, నేషనల్, ఇంటర్నేషనల్ వివాహము వల్ల ఎవ్వరికి నష్టం కలగలేదు కానీ.. మీరు కూడా కావాలంటే భారతమ్మకు విడాకులు ఇచ్చి ఎన్ని పెళ్లిళ్లు అయినా చేసుకోవచ్చు అని, సియం జగన్ మోహన్ రెడ్డి లోకల్, నేషనల్, ఇంటర్ నేషనల్ క్రిమినల్ స్థాయి కూడా దాటిపోయాడని, ప్రస్తుతం



ఆయన బెయిల్ మీద ఉన్న విషయం మర్చిపోయినట్లు ఉన్నాడని,ఆ బెయిల్ రద్దయితే నీ పరిస్థితి ఎక్కడో ముందు అది చూసుకోవాలని, కాపులు మీదా ఎన్నడూ లేని ప్రేమ వెలుగబోస్తున్న జగన్ నలుగురు పనికిమానిన కాపుల కు మంత్రి పదవులు ఇచ్చి, కాపులు మొత్తాన్ని ఏదో ఉద్ధరిస్తున్నట్లు ఫీలవుతున్నాడని..రాష్టంలో ఎలాంటి అనర్థము జరిగిన పవన్ కళ్యాణ్ మూడు పెళ్ళిల్ల వల్లేనే అన్నట్లు మాట్లాడటం మీకు పరిపాలన చేతకాక, చేయ్యలేక కప్పిపుచ్చుకునే మాటలని ప్రజలకు చక్కగా అర్థమవుతుందని, దమ్ముంటే మూడు వివాహాల మీదా కేసు పెట్టండి లేదా రాజ్యాంగంలో సవరణ తీసుకురండి, అంతేకాని రాజ్యాంగబద్ధంగా విడాకులు ఇచ్చి చేసుకున్న వివాహాల గురించి హేళన చేయడం రాజ్యాంగాన్ని అవమానించినట్లు ఉందని, దీనిపై ఉన్నత న్యాయస్థానాలు చర్యలు తీసుకోవాలని, పవన్ కళ్యాణ్ ఐటి రిటర్న్ తీసుకొండి ముకు లావా దేవీలు తెలుస్తాయని, గతంలో మా పార్టీ ఆఫీసులో మా అధ్యక్షులు ఆయన సంపాదన ఎంత, ఖర్చులు ఎంత అనేది మీడియా ముఖంగా లెక్కలు చూపించారని.. చేతనైతే మీరు, మీ ఎమ్మెల్యేలు మీడియా ముఖంగా మీ ఆర్థిక లావాదేవీల వివరాలు చెప్పగలరా, చెప్పే దమ్ము మీకు ఉందా అని, ఎంత ప్యాకేజ్ తీసుకోని రాజ్యసభ సభ్యుడిగా రిలయన్స్ వారికి ఇచ్చారో చెప్పగలరా అని, మీ భార్యతో కలసి ఎందుకు హిందు దేవాలయాలకు రారు అని, నీలా ఎలక్షన్ ముందు ఒకలా, ఎలక్షన్ తర్వాత ఒకలా నటించడం మా పవన్ కళ్యాణ్ కు చేతకాదని గురువారం తిరుపతిలో మీడియా ముఖంగా జనసేన నేత కిరణ్ రాయల్ పవన్ కళ్యాణ్ పై సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిచారు.ఈ మీడియా సమావేశంలో పార్థు, వినోద్, లోహిత్, ఆది, సాయి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# నేదురుమల్లి పై మండిపడ్డ ఎస్ఎస్ఆర్ నాయుడు

**శ్రీ చక్ర వెంకటగిరి**

తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలోని, తూర్పు వీధిలో భారతీయ జనతా పార్టీ కార్యాలయము లో వెంకటగిరి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఎస్.ఎస్.ఆర్ నాయుడు విలేఖరుల సమావేశం లో. మాట్లాడుతూ.... ఈనెల 4 ,5 తేదీలలో జరిగిన శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా మేము లక్షలు ఖర్చుపెట్టి, చలివేంద్రాలు ఏర్పాటు చేసి, జాతరకు వచ్చే వేలాదిమంది భక్తులకు చల్లని మజ్జిగ,మంచినీరు, పానకము అందజేస్తున్నామని, ఈ సందర్భంగా మేము 2,3 తేదీలలో పట్టణంలో పలుచోట్ల బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టించామని, వాటిని అధికార పార్టీ నాయకులు మున్సిపల్ అధికారులకు చెప్పి , మా పార్టీ (బిజెపి) జెండాలను, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారని, ఇది మంచి పద్ధతి కాదని తెలియజేశారు. మేము లక్షలు ఖర్చుపెట్టి సేవా కార్యక్రమాలు చేస్తుంటే వారు ఆటంకం కలిగిస్తున్నారని,వారికి చేతనైతే మేము చేస్తున్న సేవా కార్యక్రమాల్లో మాకు పోటీగా వారు కూడా సేవా కార్యక్రమాలు చేయలే తప్ప, ఇలా సేవ చేస్తున్న వారిని ఇబ్బంది పెడితే ఆ పోలేరమ్మ తల్లి వారిని ఊరికనే వదలదని,నేను గత పది సంవత్సరాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, స్వచ్ఛందంగా 12,500 పైగా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించానని, ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సంక్రాంతి పండుగలలో మహిళలకు ముగ్గుల పోటీలు మరియు యువతకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, ఇంకా వెంకటగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, అన్ని గ్రామాలలో 20వేలకు పైగా తైవాన్ జామ చెట్లను నాటడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్. ఆర్ నాయుడు తో పాటు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు దామా గురు ప్రసాద్తిరుపతి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపి ఆచారి, ఓబీసీ మోర్చా




ఉపాధ్యక్షులు నీలకంఠ మురళి , సీనియర్ నాయకులు వయ్యావూరు రమణయ్య , దక్కిలి మండల అధ్యక్షులు కొల్లూరు బాలకృష్ణ నాయుడు ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, అంకుపల్లి ముసలయ్య, కార్యదర్శి బుధవారపు అంకయ్య, నాయకులు మాధవ్,చక్రవర్తి, పెద్ద అంకయ్య తదితర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు..



## ఇప్పుడు నా టైమ్ నడుస్తోందంటోన్న రష్మిక

అల్లు అర్జున్ నటించిన పుష్ప తో పాన్ ఇండియా హీరోయిన్‌గా మారిపోయింది రష్మిక మంధాన. ప్రస్తుతం ఆమె దక్షిణాది లతో పాటు హిందీ మూవీస్‌లోనూ నటిస్తూ బిజీబిజీగా ఉంటోంది.స్టార్ హీరోల ల్లో గ్లామర్ రోల్స్ చేస్తూనే లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తోంది.అల్లు అర్జున్ నటించిన పుష్ప తో పాన్ ఇండియా హీరోయిన్‌గా మారిపోయింది రష్మిక మంధాన. ప్రస్తుతం ఆమె దక్షిణాది లతో పాటు హిందీ మూవీస్‌లోనూ నటిస్తూ బిజీబిజీగా ఉంటోంది. స్టార్ హీరోల ల్లో గ్లామర్ రోల్స్ చేస్తూనే లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లోనూ నటిస్తోంది. అయితే కోలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీల్లో రష్మికకు వరుసగా అపజయాలే ఎదురవుతున్నాయి. కోలీవుడ్‌లో రష్మిక ఎంట్రీ ఇచ్చిన కార్తీ సుల్తాన్ పెద్దగా ఆడలేదు. విజయ్ దళపతి వారసుడులో కూడా తన నటనకు స్కోప్ లేకుండా పోయింది. ఇక బాలీవుడ్‌లో తను నటించిన మిషన్ మజ్ను, గుడ్ బై లకు మంచి పేరొచ్చినా కలెక్షన్లు మాత్రం రాలేదు. ఇక పుష్ప తర్వాత తెలుగులో రష్మిక నటించిన ఆడవాళ్లు మీకు జోహార్లు పెద్దగా ఆడలేదు. అయితే ఇప్పుడిప్పుడే తన టైమ్ బాగుంటోందంటోంది నేషనల్ క్రష్. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సందర్భంలో మంచి టైమ్ వస్తుందని, అలా తనకిప్పుడు మంచి రోజులు నడుస్తున్నాయని రష్మిక చెప్పింది. తనకు మంచి పాత్రలు వస్తుండడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. కాగా రష్మిక ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్ తో కలిసి యానిమల్ లో నటిస్తోంది. అలాగే పుష్ప 2, రెయిన్ బో లు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే ఈ మూవీస్ ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

## నెగెటివ్ రివ్యూస్ రావడంతో తెలుగులో రిలీజ్ పై అనాసక్తి




కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ ఆంటోనీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బిచ్చగాడు సినిమాతో తెలుగువారిని తన అభిమానులుగా చేసుకున్న విజయ్.. ఆ సినిమా తరువాత తన అన్ని సినిమాలను తెలుగులో రిలీజ్ చేస్తున్నాడు. ఇక ఈ మధ్యనే ఆయన ఇంట్లో పెద్ద విషాదం జరిగిన విషయం తెలిసిందే. ఆయన పెద్ద కూతురు మీరా ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఒత్తిడికి లోనైనా ఆమె.. ఇలాంటి షాకింగ్ నిర్ణయం తీసుకుంది. కూతురు చనిపోవడంతో విజయ్ ఎంత కృంగిపోయాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కూతురు చనిపోయిన తర్వాత విజయ్ ఒక కీలక నిర్ణయం తీసుకున్న విషయం కూడా తెలిసిందే. ఇక కూతురు చనిపోయిన వారం రోజులకే విజయ్ మీడియా ముందుకు వచ్చి తన సినిమాకు ప్రమోషన్స్ మొదలుపెట్టి షాక్ ఇచ్చాడు. ఆ సినిమానే రత్తం. సీఎస్ అముదన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 6 న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కూతురు చనిపోయిన బాధలో ఉన్నా కూడా.. సినిమాకు ప్రమోషన్స్ చేశాడు విజయ్. ఇక తమిళ్ లో రిలీజ్ అయిన మూడు రోజులకు తెలుగులో కూడా రిలీజ్ చేయాలనీ అనుకున్నారు. కానీ, కొన్ని కారణాల వలన ఆ పని చేయలేకపోయారు. ఇక ఇప్పుడు అసలు అవసరం లేదని అనుకుంటున్నారట. తమిళ్ లో ఈ సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేదని, నెగెటివ్ రివ్యూస్ రావడంతో తెలుగులో రిలీజ్ చేసి అనవసరంగా డబ్బులు వేస్ట్ చేయించడం ఎందుకని మేకర్స్ భావిస్తున్నారని టాక్ నడుస్తుంది. కూతురు చనిపోయిన బాధలో ఉన్న విజయ్ ఆంటోనీకి రత్తం సినిమా కొంతలో కొంత అయినా రిలాక్స్ ను ఇస్తుందని ఆయన అభిమానులు భావించారు. కానీ, అది కూడా కుదరలేదు.. ఇప్పుడు ఈ సినిమా తెలుగులో కూడా రిలీజ్ కాకపోవడంతో విజయ్ ఫాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## బ్లాక్ డ్రెస్‌లో అదరగొడుతుంది



యంగ్ హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.సీరియల్ నటిగా కెరీర్ ను ప్రారంభించిన పాయల్ రాజ్ పుత్ పంజాబీ, హిందీ చిత్రాలతో నటిగా మారింది.ఆ తర్వాత నేరుగా టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అదరగొట్టింది.పాయల్ 'ఆర్స్ ఎక్స్ 100'సినిమా తో తెలుగు ఇండస్ట్రీ కి పరిచయం అయింది. ఆ సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మొదటి చిత్రంతోనే పాయల్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తన బోల్డ్ పెర్ఫామెన్స్‌తో మతులు పోగొట్టింది. అప్పట్లో ఈ భామ అందాల ఆరబోత టాలీవుడ్ లో సెన్సేషన్ గా మారింది.. ఆ తరువాత ఇక్కడ ఆమె . 'సీత', 'ఆర్డీఎక్స్ లవ్', 'వెంకీ మామా', 'డిస్కో రాజా', 'అనగనగ ఓ అతిథి', 'తీస్ మార్ ఖాన్', 'జిన్నా' వంటి సినిమాల్లో మెరిసింది. అయితే కొన్నాళ్లుగా ఈ ముద్దుగుమ్మ సినీ కెరీర్ అంతా సాఫీగా సాగడం లేదు.తమిళంలోకీ ఎంట్రీ ఇచ్చినా కూడా అక్కడా సరైన సినిమా పడలేదు. నటించిన చిత్రాలూ ఆశించిన విజయాలను ఇవ్వలేదు..దీంతో మరోసారి తన మొదటి సినిమా 'ఆర్ ఎక్స్100' డైరెక్టర్ అజయ్ భూపతితో చేతులు కలిపింది.వీరిద్దరి కాంబోలో ప్రస్తుతం 'మంగళవారం' సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రం లో పాయల్ లుక్ ఎంతగానో ఆకట్టుకోబోతోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, సాంగ్స్ సినిమాపై ఆసక్తిని పెంచేశాయి. ఈ క్రమంలో ప్రమోషన్స్ ను కూడా ఎంతో ఆసక్తికరంగా నిర్వహిస్తున్నారు.పాయల్ ఈ సినిమాపైనే ప్రస్తుతం భారీగా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.ఈ క్రమంలోనే పాయల్ కూడా తన అభిమానులను మరింతగా ఆకట్టుకునేందుకు నెట్టింట తెగ సందడి చేస్తోంది. అదిరిపోయే అవుట్ ఫిట్లలో ఫొటోషూట్లు చేస్తూ ఎంతగానో ఆకట్టుకుంటోంది.తాజాగా ఈ ముద్దుగుమ్మ బ్లాక్ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చింది. హాట్ థైస్ అందాలతో మతులు పోగొట్టింది. లేక్ వ్యూ పాయింట్ వద్ద కిర్రాక్ ఫోజులిస్తూ కుర్ర గుండెల్ని దోచుకుంది. గ్లామర్ మెరుపులతోనూ మైమరిపించింది. ఈ భామ అదిరిపోయే స్టిల్స్ కు ఫ్యాన్స్ తో పాటు నెటిజన్లు ఎంతగానో ఫిదా అవుతున్నారు.




## 16న వస్తున్న సైంధవ్ టీజర్

టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి సైంధవ్ వెంకటేశ్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రాన్ని హిట్ ఫేం శైలేష్ కొలను డైరెక్ట్ చేస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వెంకటేశ్ 75వ సినిమాగా వస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. చందప్రస్థ ఫిక్షనల్ పోర్ట్ ఏరియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే మిషన్ నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో జెర్సీ ఫేం శ్రద్దా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ను అక్టోబర్ 16న లాంఛ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. మిషన్‌లో బిజీగా ఉన్న వెంకీ టీజర్ అప్‌డేట్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంతో నవాజుద్దీన్ సిద్దిఖీ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. మేకర్స్ సైంధవ్ పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో శ్రద్ధా శ్రీనాథ్ మనోజ్ఞగా కనిపించనుంది. రుహానీ శర్మ డాక్టర్‌గా, నవాజుద్దీన్ సిద్దిఖీ వికాస్ మాలిక్ పాత్రలో, కోలీవుడ్ యాక్టర్ ఆర్య మానస్ పాత్రలో నటిస్తున్నాడు. చాలా రోజుల క్రితం లాంఛ్ చేసిన సైంధవ్ గ్లింప్స్ వీడియో సినిమాపై అంచనాలు పెంచేస్తోంది. సైంధవ్.. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో 2024 సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి తెరకెక్కిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు.

Printed and Published and Owned by **K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **Phone No. 9491789892, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**